## మార్షల్ ఆర్ట్స్‌పోటీల్లో మెరిసిన బాలికలు

**కొత్తూరు, ప్రభాతవార్త, జూలై 30 :** ఈనెల 27న సంగారెడ్డిలో నిర్వహించిన సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ ఖేలో ఇండియా సిటీ వుషు ఉమెన్స్ లీగ్ 2025 పోటీల్లో కొత్తూరుకు చెందిన ఈగల్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా అకాడమీ కోచ్ హాజీ శిక్షణలోని విద్యార్థిని నిధా రియాజ్ తాలూ సీ చెంక్వాన్ విభాగంలోని సబ్ జూనియర్ కేటగిరీలో బ్రౌన్ మెడల్ సాధించగా, మరో విద్యార్థిని కె.ప్రతిష్ట షాన్ షు విభాగంలో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో రాష్ట్ర వుషు సంఘం అధ్యక్షుడు ప్రేమ్‌రాజ్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఒమర్, జాయింట్ సెక్రెటరీ వేముల సతీష్, టోర్నమెంటు ఆర్గనైజర్ పోచయ్య, జిల్లా సంఘం అధ్యక్షుడు మొహమ్మద్ జావీద్ ఖాన్ పాల్గొన్నారు.



మెడల్ అందుకుంటున్న విద్యార్థిని



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

## ప్రభుత్వ భూమిని కాపాడండి

**షాద్‌నగర్, ప్రభాతవార్త, జూలై 30 :** ప్రభుత్వం కేటాయించిన బంజారా భవన్ భూమిని ఆక్రమణ నుండి కాపాడి హద్దులు చూపించాలని కోరుతూ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో బుధవారం మండల డిప్యూటీ తహసీల్దార్ ఆనంద్ సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు మంగులాల్ నాయక్, గిరిజన ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా చైర్మన్ శ్రీను నాయక్, తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్ నాయక్, నాయకులు బాలు నాయక్, తెలంగాణ గిరిజన సంఘం జిల్లా నాయకుడు శ్రీను నాయక్ తదితరులు మాట్లాడుతూ మండల పరిధిలోని గుండ్లకుంట గ్రామ రెవెన్యూ శివారులో సర్వే నెంబరు 12/పి లో గల ఒక ఎకరా ప్రభుత్వ భూమిని ప్రభుత్వం కేటాయించడంతో పాటు నిర్మాణం కోసం రెండు కోట్ల రూపాయలు కేటాయించారని, కానీ ఆ భూమిని కొందరు గుర్తుతెలియని వ్యక్తులు అక్రమంగా కబ్జా చేయడం జరిగిందని పేర్కొన్నారు. కావున బంజారా భవన్ భూమిని కబ్జా నుండి కాపాడి బంజారా భవన్ నిర్మాణం కోసం హద్దులు చూపించాలని కోరారు.

## అటవీ సంపద హాంఫట్

### ఇష్టారాజ్యంగా చెట్ల నరికివేత

### అడ్డుకున్న రైతుపై దౌర్జన్యం

**షాద్‌నగర్, ప్రభాతవార్త, జూలై 30 :** ఇష్టారాజ్యంగా చెట్లను నరికి అక్రమ కలప వ్యాపారం చేస్తున్న సంఘటనలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బుచ్చిగూడ గ్రామ శివారులో పెద్ద ఎత్తున చెట్లను నరికి తరలించేందుకు ప్రయత్నం చేస్తున్న వారిని గ్రామస్థులు అడ్డుకున్నారు. అక్రమంగా చెట్లను నరికి రెండు లారీల్లో లోడింగ్ చేస్తున్న సమయంలో పక్క పొలానికి చెందిన రైతు వెంకట్ రెడ్డి తన వ్యవసాయ పొలానికి వెళ్లే క్రమంలో దారికి అడ్డుగా వాహనాలు నిలపడంతో వారిని ఇదేమిటని ప్రశ్నించారు. మీకు చెట్లను నరికే అనుమతి ఎవరిచ్చారని అటవీశాఖ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఈ నేపథ్యంలో సదరు కలపను తరలించడానికి వచ్చిన వ్యాపారి రైతుతో అమర్యాదగా మాట్లాడడమే కాకుండా కేసులు పెడతామంటూ అల్టిమేటం జారీ చేయడం విడ్డూరం.

అక్రమ కలప రవాణా చేస్తున్న వారు ఇబ్రహీంపట్నం, జేపీ దర్గాకు చెందిన వారిగా స్థానికులు తెలుపుతున్నారు. అటవీశాఖ అధికారుల నిఘా వైఫల్యం కారణంగానే కలపను తరలించుకుపోతున్న వారి అకృత్యాలకు అదుపులేకుండా పోతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమ వ్యాపారుల పరిస్థితిని చూసి అవాక్కయిన రైతు స్థానిక మీడియాతో పాటు అధికారులకు సమాచారం అందించారు.

సమాచారం అందుకున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సంఘటనా స్థలానికి చేరుకున్నట్లు తెలుస్తుంది. అసలు నిత్యం ఈ రకంగా కలప రవాణా చేస్తున్న వ్యాపారులు ఎవరు..? ఎవరి అండ చూసుకొని ఇష్టారాజ్యంగా అనుమతులు లేకుండా పచ్చని చెట్లను నరుకుతూ పోతున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.


అక్రమంగా నరికిన కలప



కలపను తరలించేందుకు సిద్ధంగా ఉన్న లారీ

## బాదుడుకు రెడీ



### లైసెన్స్‌లు నుంచి వాహనాల వరకు సేవా ఛార్జీలు పెంపు

### కార్ల ధర విలువపై 0.1 శాతం అదనం

### అమలులోకి వస్తున్న కేబినెట్ నిర్ణయాలు

### ప్రస్తుతం జిల్లాలో ఏటా రూ.80 కోట్లకు పైగా ఆదాయం

### పెరిగిన ఛార్జీలతో మరో 50 కోట్ల అదనపు భారం

### తాండూరు యూనిట్‌లో సేవలకు మంగళం

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** రవాణాశాఖ ఆదాయం పెంపునకు ప్రభుత్వం వాహనాలపై ఛార్జీలను అమాంతంగా పెంచేసింది. వివిధ లైసెన్స్‌లు, రిజిస్ట్రేషన్ల కోసం వాహనదారుల దరఖాస్తులకు సేవా ఛార్జీలను పెంచారు. ఈనెల 22న ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేసేందుకు అధికారులు సన్నద్ధమైనారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు, రెన్యువల్, వాహనాల రిజిస్ట్రేషన్, హైపొథికేషన్, పర్మనెంట్ లైసెన్స్, ఫిట్‌నెస్ తదితర సేవలకు ఛార్జీలు పెంచారు. వాహనదారుడి లెర్నింగ్ లైసెన్స్‌ను రూ.335 నుంచి 440 రూపాయలకు పెంచారు. ద్విచక్రవాహనం, కారు లైసెన్స్‌ల జారీకి రూ.440 నుంచి 558 రూపాయలకు పెరిగింది. పర్మినెంట్ లైసెన్స్ జారీకి రూ.1,035 నుంచి రూ.1,135కి పెంచారు. సెకండ్‌హ్యాండ్ వాహనాలకు భారీగా పెంచడం గమనార్హం. ఈ వాహనాలను రిజిస్ట్రేషన్ చేసుకుంటే గతంలో రూ.935 మాత్రమే నిర్ణయించారు. తాజాగా పెరిగిన ఛార్జీల ప్రకారం రూ.1,805 అమలు చేయనున్నారు. బ్యాంకుల ద్వారా రుణాలు పొందిన వాహనాలు కొనుగోలు చేసి (హైపొథికేషన్) తాకట్టు పెట్టిన వాటికి కూడా భారీగా పెంచారు. రూ.2,135 నుంచి రూ.3135 నిర్ణయించారు. ఏ మోడల్ అయినా కొత్త కార్లకు రూ.5 వేలు మాత్రమే ఛార్జీలు వసూలు చేయగా ఇప్పుడు వాహనాల ధర ఆధారంగా రూ.0.1 శాతం నిర్ణయించారు. గతంలో స్లాట్ బుక్ చేసుకున్న దరఖాస్తులకూ వడ్డించనున్నారు. ఇతర రాష్ట్రాల వాహనాల రిజిస్ట్రేషన్లను పెంచవచ్చని అంటున్నారు. వాహనాల ఫిట్‌నెస్ రూ.700 నుంచి 800 రూపాయలకు పెంచనున్నారు. వికారాబాద్ జిల్లా రవాణా కార్యాలయం పరిధిలో పరిగి, తాండూరు యూనిట్ ఆఫీసులు ఉన్నాయి. ప్రతియేటా రవాణాశాఖకు జిల్లా నుంచి వివిధ సేవల రూపంలో రూ.80 కోట్లకు పైగా ఆదాయం సమకూరుతోందని సమాచారం. పెంచిన సేవా ఛార్జీల ద్వారా అదనంగా మరో 50 కోట్ల రూపాయల వరకు పెరగవచ్చని అంచనా వేస్తున్నారు.

**తాండూరు ప్రజలు పరిగి వెళ్లాల్సిందే**

రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి హయాంలో తాండూరులో యూనిట్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఆయన 2014లో ఇక్కడి నుంచే గెలుపొందడంతో వారానికి రెండు రోజులు సేవలు అందించేలా యూనిట్ ఆఫీసు ప్రారంభించారు. మంగళ, శుక్రవారాల్లో డ్రైవింగ్ లైసెన్స్‌లు, రిజిస్ట్రేషన్లు చేపట్టారు. అక్కడ మోటారు వెహికిల్ ఇన్స్‌పెక్టర్‌ను నియమించి, నలుగురు ఉద్యోగులతో సేవలు అందించారు. అయితే, 2023 తర్వాత యూనిట్ ఆఫీసుకు మంగళం పాడుతున్నారు.

కేవలం మంగళవారం మాత్రమే ఆఫీసు తెరుస్తున్నా వాహన వినియోగదారులను పరిగి యూనిట్ ఆఫీసుకు రావాలని అధికారులు సూచిస్తున్నారు. గత్యంతరం లేక పరిగికి వెళ్లి సేవలు పొందుతున్నారు. ఈ ఆఫీసును పూర్తిస్థాయిలో ఉపయోగంలోకి తీసుకు రావాలని వాహనదారులు కోరుతున్నారు.


వికారాబాద్ రవాణా కార్యాలయం


సేవలు నిలిపివేయడంతో వెలవెలబోతున్న తాండూరు యూనిట్ ఆఫీసు


ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

## వ్యవసాయానికి సమర్థవంతమైన సేవలు

### పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

**పరిగి జూలై 30 ప్రభాతవార్త :** పరిగి పట్టణంలోని ప్రజా భవన్ లో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ కమిటీ పరిగి చైర్మన్‌గా కక్కులూరి శ్రీనివాస్ రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పరిగి ఎమ్మెల్యే, డి.సి.సి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి హాజరయ్యారు... ఈ సందర్భంగా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్ రెడ్డిని, పాలకవర్గ కమిటీ సభ్యులను ఎమ్మెల్యే అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు..వ్యవసాయ రంగంతో సంబంధమున్న అత్యంత కీలక రంగమైన వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ కమిటీ ద్వారా రైతులకు నూతన సాంకేతికత, శిక్షణలు, ఫార్మింగ్ మోడళ్లపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత కొత్తగా ప్రమాణ స్వీకారం చేసిన చైర్మన్ శ్రీనివాస్ రెడ్డిపై ఉందని, రైతులకు అండగా నిలవాలన్నారు..ప్రతి రైతు బాగుపడేలా చర్యలు తీసుకోవాలని ,వ్యవసాయ పరపతి సంఘాలు రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని, వాటిని సద్వినియోగం చేసుకొని లబ్ధిపొందాలని సూచించారు.పరిగి పట్టణంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఎటిఎంఎ) కమిటీ నూతన భవన నిర్మాణానికి రూ.25 లక్షల వ్యయంతో త్వరలో శంకుస్థాపన చేయనున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు... నిరంతరం రైతు సంక్షేమం కోసం పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీపై, బీఆర్ఎస్ నాయకులు అసత్య ఆరోపణలుచేసి ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షులు పార్థసారథి పంతులు,పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాం రెడ్డి, కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్,పట్టణ అధ్యక్షులు ఎర్రగడ్డ పల్లి కృష్ణ,పరిగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎండి.అయూబ్, డిసిసి ఉపాధ్యక్షులు భీమ్ రెడ్డి,డిసిసి ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్,దోమ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి,పూడూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సురేంద్ర ముదిరాజ్,వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములను కాపాడండి

### కలెక్టర్‌కు సమస్యలు విన్నవించిన ఎమ్మెల్యే

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూలై 30, ప్రభాతవార్త :** మల్కాజ్‌గిరి అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు కబ్జాలకు గురికాకుండ కాపాడాలని, ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడే విధంగా ఆ భూములను కేటాయించాలని కోరుతూ మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరిని కలెక్టరేట్ ఛాంబర్‌లో మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి కలిసి విన్నవించారు. బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌కు మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆ ప్రాంత నాయకులు, బస్తీవాసులు, కాలనీలవాసులతో కలిసి విచ్చేసి జిల్లా కలెక్టర్‌ను కలిసి సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రాన్ని అందజేశారు. మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి కలెక్టర్ మనుచౌదరికి ఆ నియోజకవర్గంకు సంబంధించి పలు అభివృద్ధి పనుల, ప్రభుత్వ భూముల పరిరక్షణ, ప్రజా అవసరాలకు అనుగుణంగ భూముల కేటాయింపులు వంటి పలు విషయాలను కలెక్టర్ దృష్టికి తీసుకవచ్చారు. ప్రభుత్వ భూములు కబ్జాలకు గురికాకుండ కాపాడి ఆ భూములను ఆరు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లకు, లైబ్రరీలకు 15ఫైనాన్స్ కమిషన్ ప్రకారం నిధులు ఉన్నాయని వాటికి ప్రభుత్వ భూములు కేటాయిస్తే జిహెచ్‌ఎంసి ద్వారా యుపిహెచ్‌సిలు నిర్మించటానికి సిద్దంగ ఉన్నట్లు ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి వివరించారు. మల్టీపర్పస్ పంక్షన్‌హాల్‌ల నిర్మాణాల కోసం భూములు కేటాయించాలని ప్రభుత్వ భూములు ఖాళీ స్థలాలు గుర్తించినట్లు, వాటిని కేటాయిస్తే జిహెచ్‌ఎంసి ద్వారా నిర్మించటానికి సులభం అవుతుందన్నారు. ఇటీవల జరిగిన దిశ మీటింగ్‌లో గతంలో జరిగిన దిశ మీటింగ్‌లలో పేర్కొన్న అంశాలను పరిగణలోకి తీసుకుని వాజ్‌పేయినగర్‌లో ఉన్న ఇంటర్మీడియట్ కాలేజ్, డిగ్రీ కాలేజీలో ఉన్న పరిస్థితితులను వివరించగ అర్థం చేసుకుని సందర్శించి వెంటనే రెండున్నర కోట్ల రూపాయలు నిధులను కేటాయించినట్లు తెలిపారు. పాఠశాలలో అదనపు తరగతి గదులు నిర్మించటానికి చర్యలు తీసుకున్నారని, మల్కాజ్‌గిరి ప్రభుత్వ హాస్పిటల్‌ను కలెక్టర్ సందర్శించి మెరుగైన వసతులు కల్పించటానికి కృషి చేస్తానని చెప్పినందుకు ఎమ్మెల్యే దన్యవాదాలు తెలిపారు. బ్రాహ్మణ కమ్యూనిటీ భవనం కోసం స్థలం కేటాయించాలని అన్నారు. జిఓ 58,59ద్వారా

మిగతా 2లో


కలెక్టర్ మనుచౌదరితో సమావేశమైన ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

## ఆస్తులకు ఆశపడి..మైనర్‌కు పెళ్లి

### 13 ఏళ్ల కుమార్తెకు 40 ఏళ్ల ఆసామితో గుట్టుచప్పుడు కాకుండా వివాహం

### పాఠశాలకు వెళ్లిన బాలిక ఉపాధ్యాయుల వద్ద ఆవేదన

### కేసు నమోదుచేసి బాధితురాలిని రెస్క్యూ హోంకు తరలించిన పోలీసులు

**నందిగామ, జూలై 30 ప్రభాతవార్త:** నందిగామలో చట్టానికి వ్యతిరేకంగా ఓ మైనర్‌కు వివాహం చేసిన ఉదంతం కలకలం రేపింది. ఈ సంఘటన పూర్వపరాలిలా ఉన్నాయి. నందిగామ గ్రామానికి చెందిన స్రవంతి కూతురు మహేశ్వరి (13) నందిగామ హైస్కూల్లో 8 ఎనిమిదవ తరగతి చదువుతోంది. భర్త లేకపోవడంతో స్రవంతి కూలినాలి చేసి కూతుర్ని చదివించుకుంటూ జీవనం కొనసాగిస్తోంది. చేవెళ్ల మండలం కందాడ గ్రామానికి చెందిన శ్రీనివాస్ గౌడ్ (40)కి భూములు, ఆస్తులు ఉన్నాయన్న ఆశతో స్రవంతి తన కుమార్తెను ఇచ్చి గత మే 28న నందిగామ శివారులోఉన్న లింగమూర్తుల దేవాలయంలో గుట్టుచప్పుడు కాకుండా పెళ్లి చేసి అత్తగారింటికి సాగనంపింది. పండుగ కోసమని పుట్టింటికి వచ్చిన మహేశ్వరి ఈనెల 1న పుస్తె, మెట్టలు తీసేసి బడికి వచ్చింది. మంగళవారం అత్తగారింటి నుండి ఫోన్ రావడంతో మళ్లీ తనను పంపిస్తారేమోనంటూ ఆమె మహిళ ఉపాధ్యాయుల ముందు కన్నీరు మున్నిరైంది. దీంతో బాలిక తల్లిని పాఠశాలకు పిలిపించి మందలించారు.

మిగతా 2లో


లింగమూర్తుల వాగు శివాలయంలో పెళ్లి జరిగిన దృశ్యం

## రూ. 80 లక్షలతో ఆలయాల పునర్నిర్మాణం


శ్రీరంగవరం గ్రామంలో ఆలయాల స్లాబు నిర్మాణ పనులను ప్రారంభించిన మాజీ జడ్పీటీసీ శైలజా విజయనందరెడ్డి

**మేడ్చల్, జూలై 30. ప్రభాతవార్త :** మేడ్చల్ ఉమ్మడి మండల పరిధి ఎల్లంపేట్ మున్సిపాలిటీలోని శ్రీరంగవరం గ్రామంలో ఆధ్యాత్మిక శోభను ఇనుమడింపజేస్తూ, గ్రామ అమ్మవార్ల దేవతాలయాలైన పోచమ్మ, నల్ల పోచమ్మ, మహంకాళి అమ్మ, దుర్గమ్మ, ముత్యాలమ్మ ఆలయాల పునర్నిర్మాణానికి మాజీ సర్పంచ్ విజయనంద రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శైలజలు శ్రీకారం చుట్టారు. సుమారు రూ. 80 లక్షల స్వంత నిధులు, దాతల సహకారంతో ఈ ఆలయాలను అత్యంత సుందరంగా తీర్చిదిద్దనున్నారు. ఈ పునర్నిర్మాణం గ్రామానికి ఒక నూతన శోభను తీసుకురావడంతో పాటు, భక్తులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం ఏర్పడనున్నది. ఈ మహత్తర కార్యంలో భాగంగా బుధవారం ఆయా ఆలయాలకు సంబంధించిన గుడి నిర్మాణ స్లాబ్ పనులను వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య, గ్రామ ప్రజల ఆశీస్సులతో మాజీ జడ్పీటీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయనంద

మిగతా 2లో


విద్యార్థులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ మను చౌదరి

## పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

### గురుకుల రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులకు కలెక్టర్ దిశానిర్దేశం

**కీసర, జూలై 30,ప్రభాతవార్త :** విద్యార్థులకు తగిన మౌలిక సదుపాయాలను కల్పించాలని జిల్లా కలెక్టర్ మిక్కినినేని మను చౌదరి అన్నారు. బుధవారం కీసరలోని గురుకుల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటిస్తూ యూనిఫాంలు, టెస్టుబుక్కులు, నోటు పుస్తకాలు, వర్క్ పుస్తకాలనరు అందించారా లేదా అని ఆరా తీశారు. అలాగే హస్టల్‌లో ఎంతమంది విద్యార్థులు ఉన్నారు,అదే విదంగా మధ్యాహ భోజనం విద్యార్థులకు మెనూ ప్రకారం ప్రతి రోజు సమయానికి పౌష్టిక ఆహారాన్ని అందించాలని,వసతి గృహంలో అందుతున్న విద్య బోధనపై సంబందిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.గత సంవత్సరం కంటే ఈ విద్యా సంవత్సరంలో 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని కళాశాల సిబ్బందిని ఆదేశించారు.సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని

మిగతా 2లో

## అర్హులందరికీ రేషన్ కార్డులు

### ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

**మాడ్గుల, జూలై 30, ప్రభాతవార్త:** అర్హులైన ప్రతి ఒక్కరికి ఆహార భద్రత కార్డు అందజేస్తామని కల్వకుర్తి శాసన సభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. బుధవారం మాడ్గుల మండలం రైతువేదిక లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన ఆహార భద్రత కార్డులు తహసీల్దార్ ,ఎంపీడీఓ,స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను 18 నెలలలోనే అమలు చేస్తున్నమని,మిగతా పథకాలను అమలు చేస్తామని అన్నారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాలు పాలించి ప్రజలకు రేషన్ కార్డులు,ఇండ్లు ఇవ్వకుండా మోసం చేసిందని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమం,అభివృద్ధి పేరుతో పేదలకు పథకాలు అందచేస్తున్నామని అన్నారు.మాడ్గుల మండలానికి 670 నూతన రేషన్ కార్డులు 2300 పునరుద్ధరణ రేషన్ కార్డులు 10 మందికి కల్యాణలక్ష్మి , షాదీ ముబారక్ చెక్ లు మంజూరు అయింది అన్నారు.ప్రజా ప్రభుత్వం పేదల కోసం రేషన్ కార్డులు పంపిణీతో పాటు వారికి సన్న బియ్యం ఇచ్చే కార్యక్రమం చేబడుతున్నాం.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు ఇచ్చిన మాట ప్రకారం 9 రోజులలోనే 9000 కోట్ల రూపాయలు రైతు భరోసా నిధులు రైతుల ఖాతాలో జమ చేశాం. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కిషన్ రెడ్డి, కొండల్ రెడ్డి, ఏర్పుల జంగయ్య పులికంటి లక్ష్మయ్య సురేష్ నాయక్ మాజీ ఎంపీటీసీ పాండుగౌడ్, నరేందర్ రెడ్డి హోదాల్లో ఉన్న ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు,మాజీ ఎంపీపీ,మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు,యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళలు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిపై వేటు

### అక్రమాలు, దాడులతో పిఎస్‌లో కేసు నమోదుతో చర్యలు

### పార్టీ నుంచి సస్పెన్షన్ ఉత్తర్వులు

**శామీర్‌పేట, జూలై 30, ప్రభాతవార్త :** మూడుచింతలపల్లి మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కీసరి భానుచందర్‌ను ఉపాధ్యక్ష పదవి నుంచి, యూత్ కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు మేడ్చల్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తోటకూర రాహుల్‌యాదవ్ ప్రకటించారు.

లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన కీసరి భానుచందర్ మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షునిగా ఉంటూ కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ అధికారుల పేరుతో డబ్బుల డిమాండ్ చేసినట్లు, దాడులు చేసి అవతవకలు, అక్రమాలకు పాల్పడినట్లు శామీర్‌పేట పోలీస్టేషన్‌లో కేసు నమోదు కావటంతో దీనిని పరిగణలోకి కీసరి భానుచందర్‌ను మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్ష పదవి నుంచి, యూత్ కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు ఆయన పార్టీ అధికారిక ప్రకటనలో పేర్కొన్నారు.

## వలసలకు వల

### రాష్ట్రేతరుల ఓటింగ్‌పై నేతల వ్యూహం

### ముమ్మరంగా ఓటరు కార్డుల నమోదు

### అదేపనిగా సంక్షేమ పథకాల్లోనూ వారికి చోటు

### స్థానికంగా ఉన్న పేదల హక్కులకు గండి

**షాద్‌నగర్, ప్రభాతవార్త, జూలై 30 :** రానున్న స్థానిక ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలు వలస ఓటర్లపై దృష్టి పెట్టాయి. ప్రభుత్వం కొత్త ఓటర్లకు ఓటు హక్కు పొందే అవకాశాన్ని కల్పిస్తుండటంతో పరిశ్రమల్లో పనిచేసేందుకు బీహార్, ఒరిస్సా, ఉత్తరప్రదేశ్ లాంటి రాష్ట్రాల నుండి వలస వచ్చిన కార్మికులను నేతలు టార్గెట్ చేస్తున్నారు. వీరికి దగ్గరుండి ఓటు నమోదు చేయిస్తున్నారు. తద్వారా వారి మెప్పు పొంది ఓట్లు వేయించుకోవటానికి పావులు కదుపుతున్నారు. అయితే ఆధార్ కార్డు కావాలన్నా, రేషన్‌కార్డు కావాలన్నా, సంక్షేమ పథకాలు అందాలన్నా ఓటరు నమోదు తప్పనిసరి. దీనికి ఉపయోగించుకొని స్థానికులకు అందాల్సిన సంక్షేమ ఫలాలను కూడా ఇతర రాష్ట్రాల వారు అందుకుంటున్నారు. గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లలో కూడా వీరి భాగస్వామ్యం పెద్దదే. పోనీ ఇది ఇక్కడితోనే ఆగిపోదు.. వాళ్లు ఉండే రాష్ట్రాలలో కూడా వారికి ఓటరు నమోదు, ఆధార్ కార్డులు, ఇతర సంక్షేమ ఫలాలు వర్తిస్తాయి. దీనివల్ల ప్రభుత్వం రెండు విధాల నష్టపోతుంది. సామాన్యుడు రెండు వైపుల నుంచి చితికిపోతున్నాడు. నాయకులు తమ స్వార్థం కోసం చేస్తున్న ఈ కార్యక్రమం తీవ్ర ఆందోళన కలిగిస్తుంది. దీనిపై అధికారులు స్పందించి ఓటరు కార్డుల నమోదు విషయంలో కట్టుదిట్టంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**అన్నింటా వారే..**

స్థానికంగా 300కు పైగా పరిశ్రమలు ఉన్నాయి.. ఇక్కడ 80 శాతం పనిచేసేది ఇతర రాష్ట్రాల నుండి వలస వచ్చినవారే. స్థానికులకు ఇక్కడ ఉద్యోగ అవకాశాలు ఉండవు.. ఇక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిశ్రమలు, వ్యాపారాలకు సంబంధించి ఇదే అవకాశాలు కూడా వీళ్లే ఎక్కువగా పొందుతున్నారు.

మిగతా 2లో



## మైనర్‌కు పెళ్లి
(మొదటి పేజీ తరువాయి)

మైనర్ బాలికకు పెళ్లయిందన్న వార్త సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నందిగామ తహసిల్దార్ రాజేశ్వర్, సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ బాలికకు కొత్త జీవితం ఇవ్వాలని ఆలోచించి శంషాబాద్ రెస్క్యూ హోంకు తరలించారు. ఆస్తులు ఉన్నాయన్న ఆశతో బలవంతంగా కూతురును పెళ్లి చేసిన తల్లి ప్రవంతి, నడీడు పెళ్ళికొడుకు శ్రీనివాస్ గౌడ్, పెళ్లికి సహకరించిన వారిపై కేసు నమోదు చేసినట్లు సర్కిల్ ఇన్స్పెక్టర్ తెలిపారు.

## రూ.80 లక్షలతో ఆలయ పునర్నిర్మాణం
(మొదటి పేజీ తరువాయి)

రెడ్డి, శైలజ మాట్లాడుతూ... గ్రామంలోని అన్ని కులాల, వర్గాల వారికి దేవాలయాల నిర్మాణంలో తమ వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తూ, గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. మత సామరస్యాన్ని, గ్రామ ఐక్యతను చాటిచెబుతూ అందరి భాగస్వామ్యంతో ఈ ఆలయాల నిర్మాణాలను విజయవంతంగా పూర్తి చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. తాము పదవిలో ఉన్న సమయంలో గ్రామాభివృద్ధికి అత్యధికంగా నిధులు వెచ్చించినట్లు గుర్తుచేశారు. సుమారు మూడు కోట్ల రూపాయలతో గ్రామంలో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ నిర్మాణం వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాల పనులను స్వయంగా పర్యవేక్షి ఒచి పూర్తి చేశామన్నారు. ఈ పనులు గ్రామ రూపురేఖలనే మార్చివేశాయని, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాయని తెలిపారు. అయితే, ఇప్పటివరకు ఆ పనులకు సంబంధించిన బిల్లులు రాలేదని తెలిపారు. అయినప్పటికీ, గ్రామ అభివృద్ధి విషయంలో తాము ఎప్పుడూ వెనకడుగు వేయలేదని, పదవిలో లేకున్నా భవిష్యత్తులోనూ మరిన్ని అభివృద్ధి పనులు చేసేందుకు ఎల్లవేళలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ నరసింహ, పార్టీ ప్రెసిడెంట్ బిక్షపతి, మాజీ వార్డ్ మెంబర్లు నాగార్జున రెడ్డి, యాదయ్య గౌడ్, పెంటారెడ్డి, బాలమణి, ఎస్ కృష్ణారెడ్డి, ఎస్ నరసింహారెడ్డి, బాలరాజ్, నాయకులు ప్రవీణ్, ఆసిఫ్, గడ్డం మల్లేష్, నారాయణ, మంగలి శ్రీనివాస్, కుమ్మరి బాబు, గడ్డ మల్లేష్, నవీన్, మల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి, ధర్మయ్య, ఆది శంకరయ్య, కొరివి నారాయణ, రాజయ్య, నరహరి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వలసలకు వల
(మొదటి పేజీ తరువాయి)

చిన్న గప్‌చుప్ బండి, మొక్కజొన్న పొత్తులతో మొదలుపెట్టి బంగారం దుకాణాల దాకా అంతటా వీరిదే ఆధిపత్యం. ఇక పరిశ్రమలు కూడా ఎక్కువగా ఇతర రాష్ట్రాల వారివే ఉన్నాయి. అందుకే ఉద్యోగాల విషయంలో అక్కడి వారికే ఎక్కువ ప్రాధాన్యత లభిస్తుంది. ఇక తాజాగా సంక్షేమ పథకాల విషయంలో కూడా వీళ్ల ఎంట్రీ ఇవ్వడంతో సామాన్యులకు బతకడమే గగనంగా మారిన పరిస్థితి. ఒక్కో నాయకుడు 200 నుండి 250 ఓట్లు టార్గెట్‌గా పెట్టుకొని ఇతర రాష్ట్రాల వారిని ఓటర్లుగా తయారు చేస్తున్నారు. అధికారులు కూడా దీనిని పెద్దగా విచారణ చేయడం లేదు. తాము అద్దెకు ఉండే ఇంట్లో ఒక కరెంటు బిల్లు పెడితే చాలు వీళ్లకు ఓటు హక్కు వచ్చేస్తుంది. దీంతో స్థానికుల కన్నా ఎక్కువగా ఇతర రాష్ట్రాల వారు నాయకుల గెలుపోటములను శాసించే స్థాయికి ఎదుగుతున్నారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి ఓటరు కార్డులు ఇచ్చేటప్పుడు అన్నివిధాల పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఇది వరకు జారీ చేసిన బోగస్ ఓట్లను కూడా అధికారులు చిత్తశుద్ధితో తొలగించాల్సిన అవసరం ఉంది.. స్వార్థ నాయకుల అత్యాశకు అడ్డుకట్ట పడాల్సి ఉంది.

## ప్రభుత్వ భూములను కాపాడండి
(మొదటి పేజీ తరువాయి)

దరఖాస్తు చేసుకున్న పేదలను గుర్తించి అవతవకలు జరగకుండ జిఓ 59ద్వారా డబ్బులు చెల్లించినవారికి భూములను రెగ్యులర్ చేయాలని కలెక్టర్‌ను ఎమ్మెల్యే కోరారు. ప్రభుత్వ భూములు సర్వేనెంబరు 844 హైదరాబాద్-మేడ్చల్ జిల్లాల మధ్య మల్కాజ్‌గిరి, మారెడ్‌పల్లి మండలాలు భౌగోళిక సరిహద్దులు గుర్తించక దాదాపు 55ఎకరాలు భూములు కబ్జాలకు గురి అవుతున్నాయని ఆ భూమిని కాపాడి నవోదయ స్కూల్ ఏర్పాటుకు కేటాయించాలని, ఎడి సర్వే చేయించాలని ఎమ్మెల్యే కలెక్టర్‌ను కోరారు. హిల్‌టాప్‌కాలనీలో, వినోభానగర్‌లో, యాప్రాల్‌లో, అల్వాల్ జొన్నబండ ప్రాంతంలో ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు. అదే విధంగా పలు సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ మనుచౌదరిని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు అనిల్‌కిషోర్‌గౌడ్, మేకల సునీత రాముయాదవ్, తోట నరేందర్‌రెడ్డి, డోలి రమేష్, పలువురు నాయకులు, బస్తీలవాసులు తదితరులు పాల్గొన్నారు.

## పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి
(మొదటి పేజీ తరువాయి)

కలెక్టర్ ప్రశ్నించగా పరిసర ప్రాంతాల్లో లైట్స్ లేవని తద్వారా విద్యార్థులకు ఇబ్బందిగా ఉందని తెలుపగా లైట్లను తక్షణమే ఏర్పాటు చేయాలని అలాగే పరిసర ప్రాంతాల్లో చెత్త చెదారం లేకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని దమ్మాయిగూడ మున్సిపల్ కమీషనర్ వెంకట్‌రెడ్డిని ఆదేశించారు. విద్యార్థులకు మారుతన్న టెక్నాలజీపై అవగాహన కల్పిస్తూ నైపుణ్య సామర్థ్యాన్ని పెపొందించాలని సంబందిత బోధన సిబ్బందికి సూచించారు. తదనుగుణంగా కంప్యూటర్లను సమకూర్చుకోవాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం తరగతి గదులను పరిశీలిస్తూ 10వ తరగతి విద్యార్థులతో ముచ్చటిస్తూ గణిత శాస్త్రాన్ని బోధిస్తూ విద్యార్థుల యొక్క పరిజ్ఞానాన్ని పరిశీలించడానికి విద్యార్థులతో బ్లాక్ బోర్డుపై లెక్కలు యొక్క సమాధానాలను చేయించారు. తదుపరి వంటగదిని సందర్శించి నాణ్యతతో కూడిన పరిశుభ్రంగా ఆహార పదార్థాలను తయారు చేయాలని వంట చేసే వాళ్లకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి కలెక్టర్ భోజనం చేశారు. భోజనం రుచికరంగా ఉందని తెలిపారు. ఆహార పదార్థాలను విద్యార్థులు సక్రమంగా తినే విదంగా క్రమం తప్పకుండాఆ పర్యవేక్షించాలన్నారు.

**ఫెర్టిలైజర్ దుకానాన్ని పరిశీలించిన కలెక్టర్**

కీసరలోని ఫెర్టిలైజర్ షాపును కలెక్టర్ మను చౌదరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫెర్టిలైజర్ షాపును పరిశీలిస్తూ స్టాక్ రిజిస్టర్ ప్రకారం ఎంత ఎరువులు, క్రిమి సంహారక మందులు కంపెనీల వారిగా ఎంత నిల్వ ఉన్నదని పరిశీలించారు. అదే విదంగా ఎరువులు ఎక్కడ నిల్వ ఉన్నదని పరిశీలించారు. అదే విదంగా ఎరువులు ఎక్కడ నుండి సరఫరా అవుతాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యూరియానే రైతులు అధిక మొత్తంలో వినియోగిస్తున్నందున ఇతర ఎరువులపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన లేనందున దానికి అనుగుణంగా రైతులందరికి ఎరువులు, పురుగు మందులు వినియోగించడంపై రైతులకు తగిన సూచనలు సలహాలు ఇవ్వాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. అలాగే నకిలీ మందులు, ఎరువులు విక్రయించకుండా వ్యవసాయ శాఖ అధికారులు ఎప్పటికప్పుడూ పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పాఠశాలల కన్వీనర్ రజినికాంత్, పాఠశాల ప్రిన్సిపాల్ మహలక్ష్మీ, జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ, మండల వ్యవసాయాధికారి మాధవి తదితరులు పాల్గొన్నారు.

## గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు అవంతి ఆహ్వానం

**హైదరాబాద్ జూలై30, ప్రభాతవార్త :**

అవంతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల 20వ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరు కావాలని కోరుతూ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను అవంతి విద్యాసంస్థల చైర్మన్ మాజీ మంత్రి ఎం. శ్రీనివాస్ రావు రాజభవన్‌లో కలిసి విజ్ఞప్తి చేశారు. అవంతి గ్రూప్ ఆఫ్ కాలేజెస్లో ఇంజనీరింగ్, ఫార్మసీ, మేనేజ్మెంట్, అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యను అందించే 20 ప్రతిష్టాత్మక సంస్థల నెట్వర్క్ అభివృద్ధి చెందిందని ఆయన గవర్నర్‌కు

## వారంలోపు వైద్య కళాశాల అందుబాటులోకి రావాలి

**తాండూరు, జూలై 30, ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా తాండూరులో తాత్కాలికంగా ప్రారంబించనున్న కొడంగల్ మెడికల్ కళాశాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మరో వారంలోపు అన్ని మౌళిక సదుపాయాలు కల్పించి సిద్దంగా ఉంచాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య వాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ క్రిస్టినా జెడ్ చోగ్దు అధికారులను ఆదేశించారు. తాండూరు పట్టణం హైదరాబాద్ రోడ్డు మార్గంలో నిర్మిస్తున్న నర్సింగ్ కళాశాలలో తాత్కాలికంగా ఏర్పాటు చేయబోతున్న కొడంగల్ మెడికల్ కళాశాలను రాష్ట్ర వైద్య ఆరోగ్య వాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ క్రిస్టినా జెడ్ చోగ్దు, వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి పరిశీలించారు. వైద్య కళాశాలకు సంబందించి మ్యాపును, వసతులను, భవనంలో గదులను పరిశీలించి ఏర్పాట్లపై ఆరాతీశారు. భవనంలో ప్రతి గదికి నెంబర్లు వేయాలని, సీసీ కెమెరాలు, తాగునీరు, లైట్లు, సెక్యూరిటీ గదులు వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భవనం ముందు ప్రహారిని, రోడ్డును నిర్మాంచాలని సూచించారు. పనులను త్వరితగతిని పూర్తిచేయాలని, మరో వారంలోపు అందుబాటులోకి వచ్చేలా సిద్దం చేయాలని అన్నారు. అదేవిదంగా హైదరాబాద్ రోడ్డు మార్గంలోని మైనార్టీ హస్టల్‌లో ఏర్పాటు చేస్తున్న వసతి ఏర్పాట్లనుకూడా పరిశీలించారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రిలోని ఐసియూ, బ్లడ్ బ్యాంకు, ఎమర్జెన్సీ వార్డు, ఐసీటిసి ల్యాబ్, వివిద విభాగాలను పరిశీలించారు. ఆయా విభాగాలలో వైద్యులతో మాట్లాడి వసతులు, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వివిద ప్రాంతాల నుండి వచ్చే రోగులను పలకరించారు. ఆసుపత్రిలో వైద్యులు రోగులకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రతి వార్డును పరిశుభ్రంగా ఉంచుకొని రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. అనంతరం హైదరాబాద్ రోడ్డు మార్గంలోని మాతాశిశు ఆసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రిలో గర్భిణీలు, బాలింతలకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ పాల్గొన్నారు.

## మూడునెలలు బిల్లు కట్టకపోతే ..పవర్‌కట్

**-కమర్షియల్, బిల్‌స్టాప్ కనెక్షన్లపై ప్రత్యేక డ్రైవ్**

**-ఛీఫ్ ఇంజనీర్ పాండ్యా నాయక్**



రాఘవేంద్రనగర్‌లో పర్యటిస్తున్న పాండ్యానాయక్, అంజయ్య, ఎస్ఈ చంద్రశేఖర్, డిఈ శ్యాం తదితరులు

**హైదరాబాద్ జూలై 30, ప్రభాతవార్త**

విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడానికి నిరంతం కృషి చేస్తున్నామని రంగారెడ్డి జోన్ ఛీఫ్ ఇంజనీర్ పాండ్యా నాయక్ అన్నారు. టిజిఎస్ పిడిసిఎల్ సిఎండీ ముషారఫ్ ఫరూఖీ ఆదేశాల మేరకు బస్తీబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం జనరల్ మేనేజర్ అంజయ్య, సైబర్‌సిటీ ఎస్ చంద్రశేఖర్, డిఈ శ్యామ్‌లతో కలిసి కొండాపూర్ డివిజన్లో గల 11 కెవి రాఘవేంద్ర నగర్ ఫీడర్‌ను తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాండ్యా నాయక్ మాట్లాడుతూ..రంగారెడ్డి జోన్ సైబర్ సిటీ సర్కిల్ లో ఉన్న క్యాటగిరి 2 మరియు క్యాటగిరి 3 మొండిబకాయిలు వసూళ్ల పై సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగిందని ముఖ్యంగా కమర్షియల్ సర్వీసులు గత మూడు నెలలుగా పేమెంట్ చేయకుండా సప్లై వాడుతున్న కనెక్షన్లు వెంటనే డిస్కనెక్ట్ చేసి బకాయిలను వసూలు చేయాలని, లేనిపక్షంలో సంబంధిత అధికారులపై శాఖపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. అలాగే హెచ్‌టి బిల్ స్టాప్ సర్వీస్ లకు నోటీసు బోర్డులు సత్వరమే ఫిక్స్ చేసి వాటి పైన ఉన్న లింకు సర్వీసులను గుర్తించి వాటిని డిస్కనెక్ట్ చేసి బకాయిలను వసూలు చేయాలని ఆదేశించారు. జీఎం అంజయ్య మాట్లాడుతూ హెచ్‌టి సర్వీసులకు సంబంధించి డ్యూ డేట్ లోపల కట్టాలని లేని పక్షంలో కనెక్షన్ కట్ చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా గత జనవరి నుండి జూన్ వరకు ఎక్కువగా విద్యుత్ అంతరాయాలపై 1912 కాల్ సెంటర్లకు ఎక్కువగా ఫిర్యాదులు వచ్చిన ఫీడర్‌ను తనిఖీ నిర్వహించడం జరిగిందన్నారు. అలాగేపై అధికారుల పర్మిషన్ లేకుండా లైన్ క్లియరెన్స్‌లు తీసుకోవద్దని, అత్యవసర పరిస్థితులలో అనుమతి తీసుకున్నాకనే లైన్ క్లియర్ తీసుకోవాల్సిందిగా ఆదేశించినట్లు తెలిపారు.

## ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండేదే కాంగ్రెస్ ప్రభుత్వం : ఎమ్మెల్యే వీర్లపల్లి

**కేశంపేట జూలై 30 ప్రభాతవార్త :**



ఎన్నికల ముందు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండి ప్రజలకు న్యాయం చేసే ప్రభుత్వమే కాంగ్రెస్ ప్రభుత్వం అని షాద్ నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని వేములనర్వ, పుట్టోని గూడ, తులవానిగడ్డ, కొత్తపేట గ్రామాలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తూలవానిగడ్డ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ గతంలో రాష్ట్రాన్ని 10 సంవత్సరాలు పరిపాలించిన నేతలు రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా చేస్తామని గొప్పగా చెప్పి ఎక్కడి పనులు అక్కడే వదిలేసి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి పోయారని ఆయన ఎద్దేవా చేశారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో విఫలమైవడంతో పాటు ప్రజలకు నరకం చూపించిన నేతలు బిఆర్ఎస్ వాళ్ళు అన్నారు. ప్రజల దీవెనలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకు ఒకటి తర్వాత ఒకటి సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తున్నట్లు తెలిపారు. గత పది సంవత్సరాలు పరిపాలించిన టిఆర్ఎస్ ప్రభుత్వం తన స్వలాభం కోసమే పని చేసిందని పేదలకు ఒక్క ఇల్లు కట్టించిన పాపాన పోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇచ్చిన ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గతంలో పరిపాలించిన ఎమ్మెల్యే ఇప్పుడు పరిపాలిస్తున్న ఎమ్మెల్యే మధ్య తేడాను ప్రజలు గమనించాలన్నారు. కొందరు బిఆర్ఎస్ నేతలు కాళేశ్వరం ప్రాజెక్టు, మద్యం కుంభకోణాలలో ఇరుక్కుని ఆంబోతుల, రాష్ట్ర ముఖ్యమంత్రిని దూషించడం మానుకోవాలన్నారు. గతంలో మండలాన్ని పరిపాలించిన నాయకులు ఆక్రమాలకు పాల్పడితే, నేడు పార్టీలకతీతంగా పనులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే గ్రామంలోని నాయకులందరూ కలిసికట్టుగా ఉండి సంక్షేమ అభివృద్ధి పథకాలు చేసుకోవాలని తెలిపారు. అనంతరం కేశంపేట మండల పరిధిలోని అశోక్ రెడ్డి కన్వెన్షన్ హాల్లో నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు మండలానికి నూతనంగా 2244 రేషన్ కార్డుల ప్రొసీడింగ్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వెంకట రమణ, ఎంపీడీవో కిష్టయ్య, తహసిల్దార్ ఆజం అలీ, కేశంపేట తాజా మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గూడ వీరేశం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, జగదీశ్వర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు భాస్కర్ గౌడ్ ,కర్ణాకర్ కాంగ్రెస్ నాయకులు శ్రీధర్ రెడ్డి, సురేష్ రెడ్డి, అనసూయమ్మ, గిరి యాదవ్, కరుణాకర్ రెడ్డి, విజేందర్ రెడ్డి, కర్ణాకర్, రావుల పెంటయ్య ముదిరాజ్, కోదూరు రాములు, తైద పర్వతాలు, ఎదురే నగేష్ కొరుడు నర్సింలు, మండల పరిధిలోని వివిధ శాఖల అధికారులు నాయకులు పాల్గొన్నారు.

## మట్టి లోడ్లతో దూసుకెళ్తున్న లారీలు

**-పట్టించుకోని సంబంధిత అధికారులు**

**-ప్రజారోగ్యం, పర్యావరణానికి హాని కలుగుతుందని స్థానికుల ఆందోళన**



హిమాయత్ సాగర్ వెళ్లే దారిలో ఎలాంటి కవర్లు లేకుండా మట్టి లోడ్‌తో దుసుకపోతున్న లారీ దృశ్యం

**అత్తాపూర్ జూలై30, ప్రభాతవార్త :**

లారీపై కవర్లు కప్పకుండా మట్టి తరలించడం అనేది నిబంధనలకు విరుద్ధం అయినప్పటికి పట్టించుకోవాల్సి ఆర్టీఎ, ట్రాఫిక్ పోలీసులు మాత్రం చర్యలు తీసుకోవడంలో పూరిగా విఫలమవుతున్నారని తనిఖీలు మరచారని స్థానికులు, ప్రయాణికుల నుండి ఆరోపణలు వస్తున్నాయి. మట్టిని తరలించేటప్పుడు దుమ్ము రాకుండా, పర్యావరణాన్ని కాపాడేందుకు లారీపై టార్పాలిన్ లేదా కవర్ కప్పడం తప్పనిసరి అయినప్పటికి కొందరు వ్యక్తులు ఈ నిబంధనను పాటించకుండా మట్టిని తరలిస్తున్నారని దినితో దుమ్ము, ధూళి వ్యాపించి ప్రజారోగ్యం, పర్యావరణానికి హాని కలుగుతుందని వాపోతున్నారు. రాజేంద్రనగర్ మండలంలోని ఆయా రహదారులలో ఎర్ర, నల్ల మట్టి టీప్పర్లు, లారీలు ఇష్టారాజ్యంగా నడుపుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం దుమ్ము లేవకుండా నీరు చల్లిన తర్వాత టార్పాలిన్ (కవర్లు) కప్పుకొని నిర్ణీత వేగంతో లారీలను తీసుకెళ్లాలి. కాని కొందరు యజమానులు ఒత్తిడితో అధిక ట్రీప్పులు చేయాలనే ఉద్దేశంతో వేగంగా వాహనాలు నడుపుతున్నారు. దీనికి తోడు స్పీడ్ బ్రేకర్లు, గుంతల వద్ద అదే వేగంతో వెళ్తుండటంతో లారీలోని ఎర్ర మట్టి, కంకర రహదారులపై పడుతున్నాయి. ఇతర వాహనాదారులు ప్రమాదాలు బారిన పడుతున్నారు. అయితే బుధవారం రాజేంద్రనగర్ నుండి హిమాయత్‌సాగర్ వెళ్లే మార్గంలో ఓ టీప్పర్‌లో మట్టితో కవర్లు కప్పకుండా తీసుకెళ్తడడంతో వెనక వచ్చే ఇతర వాహనాదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

**తనిఖీలు చేయారా ?**

కొందరు టీప్పర్ లారీల యజమానులు నిబంధనలకు విరుద్ధంగా మట్టి, కంకర లోడును తీసుకెళ్తాన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నా లారీల నుంచి విపరీతమైన పొగ, దుమ్ము, వెలువడుతుండటంతో ప్రయాణిలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లారీల వేగాన్ని అధికలోడును నియంత్రించి ,వాహనాల సామర్థ్యాన్ని పరిశీలించాల్సిన సంబంధిత అధికారులు ఆదిశగా తనిఖీలు చేపట్టకుండా మామూలుగా తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

## పేదల వైద్య సేవలకు సహకారం : పద్మారావు గౌడ్

**సికింద్రాబాద్, జూలై 30 ప్రభాతవార్త:**

సికింద్రాబాద్ లోని తుకారం గేట్ కు చెందిన మక్కల లక్ష్మణ్ లాలాపేట కు చెందిన షేఖ్ బషీర్, సితాఫల మండీ కి చెందిన మానేపల్లి సిద్దార్థ్ , ఉమ్మడి కమల లు అనారోగ్యంతో సతమతమవుతున్న దశలో సమాచారం అందుకున్న స్థానిక శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ వారి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.6.80 లక్షల మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి లెటర్ అఫ్ క్రెడిట్ (ఎల్.ఓ.సీ) పత్రాలను సితాఫలమండీ లోని ఎం.ఎల్.ఏ. క్యాంపు కార్యాలయంలో బుధవారం అందించారు. ఈకార్యక్రమంలో బీ.ఆర్.ఎస్. నేతలు, అధికారులు పాల్గొన్నారు. పద్మారావు గౌడ్ మాట్లాడుతూ నిరుపేదలకు నాణ్యమైన భారంగా మారిన దశలో వైద్య సేవలను పొందేందుకు తమ వంతు సహకారాన్ని అందిస్తున్నామని అన్నారు.

## మంచి నీరు,డ్రైనేజీ సమస్యలు పరిష్కారం

**న-జలమండలి సర్కిల్ 4 సిజిఎం నారాయణ**

**మైలార్‌దేవ్‌పల్లి, జూలై 30 ప్రభాతవార్త :** రాజేంద్ర నగర్‌లో మంచినీటి సరఫరా, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించటానికి తగు చర్యలు తీసుకుంటామని జలమండలి సర్కిల్ 4 సిజిఎం నారాయణ అన్నారు. రాజేంద్రనగర్ జలమండలి డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో ఆయన ప్రజలు నుంచి వచ్చిన సమస్యలను తెలుసుకునేందుకు జిఎం సాయిలక్ష్మి, డిజిఎం జోహార్ అలీ, రేణుకలతో కలిసి పర్యటించారు. స్థానిక ప్రజలను స్వయంగా సమస్యలను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి పనులు కోసం అంచనాలు రూపొందించి పరిశీలించేందుకు స్థానిక అధికారులు పని చేస్తారని ఆయన తెలియజేశారు. ప్రజలు నుంచి వచ్చే ఫిర్యాదులను పరిష్కరించటానికి అన్ని విధాలు కృషి చేస్తామని ఆయన తెలిపారు.

## కెపిఆర్‌ఐటీ విక్టోరియా సంస్థతో భాగస్వామ్యం

**ఘట్‌కేసర్, జూలై 30, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ ఘణాపూర్‌లోని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కళాశాలలో యాజమాన్యం బుధవారం అంతర్జాతీయ భాగస్వామ్యం కుదుర్చుకుంది. కేపీఆర్‌ఐటీ ఆవిష్కరణలతో కూడిన భవిష్యత్తు కోసం ఆస్ట్రేలియాలోని మెల్‌భోర్న్ నగరంలోని విక్టోరియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీతో భాగస్వామ్యం కుదుర్చు కుంది. ఈసందర్భంగా నిర్వహించిన సమావేశంలో కేపీఆర్ ఈఎస్ వైస్‌చైర్మన్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, కేపీఆర్‌ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సుధీర్‌ప్రేమ్‌కుమార్, కేపీఆర్‌ఈఎస్ వైస్‌ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనాథ్, కార్పొరేట్ రిలేషన్స్ డీన్ ఆనిష్ శ్రీవాస్తవ, విక్టోరియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సీఈఓ అర్జున్ సూరపానేని, కేకేర్ కన్సల్ట్ సీఈఓ, ఫౌండర్ మెనేని రోహిత్‌రావు విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు. ఈభాగస్వామ్యం ద్వారా విద్యార్థులకు గ్లోబల్ స్కోఫ్, ఇంటర్నేషనల్ ఎక్స్‌పోజర్, అత్యాధునిక టెక్నాలజీ అభ్యాసానికి అవకాశం లభించనుంది. భవిష్యత్‌కు మైలు రాయిగా నిలుస్తుంది.

## యువజన కాంగ్రెస్ బలోపేతానికి కృషిచేస్తా

**కొడంగల్, జూలై 30ప్రభాతవార్త :** యువజన కాంగ్రెస్ బలోపేతానికి కృషిచేస్తానని యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి కృష్ణంరాజు తెలిపారు. యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శిగా కృష్ణంరాజును నియమితులైయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం విడుదల చేసిన జాబితాలో యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శిగా ఆయన పేరును ప్రకటించారు. ఈ సందర్బంగా కృష్ణంరాజు మాట్లాడుతూ తనను జాతీయ యువన కాంగ్రెస్ కార్యదర్శిగా నియమించడం పట్ల కాంగ్రెస్ జాతీయ నాయకులు సోనియాగాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘట్‌కేసర్ ఇన్స్పెక్టర్‌గా బాలస్వామి

**ఘుటక్సేసర్, జూలై 30, ట్రుఎుభోవారత్‌:** ఘట్‌కేసర్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా బి.బాలస్వామి బుధవారం బాధ్యతలు చేపట్టారు. పోలీస్‌స్టేషన్‌లో ఆయన భాధ్యతలు స్వీకరించి ఎస్ఐలు, సిబ్బందితో సమావేశమై నిర్వహణ, కేసులు, శాంతిభద్రతలపై చర్చించారు. మేడిపల్లి డిటెక్టివ్ ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన బాలస్వామి ఘట్‌కేసర్‌కు బదిలీపై వచ్చారు. ఇక్కడ 9 నెలల పాటు ఎస్‌హెచ్ఓగా విధులు నిర్వహించిన పందిరి పరుశురాం రాచకొండ స్పెషన్ బ్రాంచ్‌కు బదిలీపై వెళ్లారు. ఈసందర్భంగా ఇన్‌స్పెక్టర్ బాలస్వామి మాట్లాడుతూ నేరాల నియంత్రణకు ప్రజలు సహకరించాలన్నారు.

## కళ, విద్య రెండు కళ్లుగా సాయి అంకిత ప్రస్థానం



సాయిఅంకిత కూచిపూడి నృత్య ప్రదర్శనలో ఒక దృశ్యం

**రవీంద్రభారతి, జూలై 30 ప్రభాతవార్త :** ఒకపక్క భారతీయ శాస్త్రీయ కళలపై మక్కువ మరోవైపు విద్య పరమావధిగా ఒకే సమయంతో రెండురంగాలను తన రెండు కళ్లుగా కోటంరాజు సాయిఅంకిత ప్రస్థానం కొనసాగించడం తదనుగుణంగా తల్లిదండ్రులు శైలజ మోహన్‌లు ప్రోత్సహించడం విశేషం... నేటి యువతకు స్ఫూర్తిదాయకం. గత 13 ఏళ్లగా ప్రముఖ నాట్యగురువు డా. సాయిగీత వద్ద తెలుగువారి కూచిపూడి నృత్యాన్ని అభ్యసిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అన్నమాచార్య మ్యూజిక్ అండ్ డ్యాన్స్ కాలేజీలో రెగ్యులర్ విద్యార్థిగా శిక్షణ పొంది పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుండి నృత్యంలో సర్టిఫికెట్, డిప్లొమా కోర్సులలో ప్రథమస్థానంలో ఉత్తీర్ణత సాధించింది. ప్రస్తుతం ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. రవీంద్రభారతి ప్రధాన మందిరంలో అమృత ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో సంస్థ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని కూచిపూడి నాట్యశైలిలో జరిగిన నృత్యప్రదర్శనల్లో ఇప్పటికే అనేక ప్రతిష్టాత్మక వేదికలపై రామాయణశబ్దం, రుక్మిణి ప్రవేశదరువు, ఆనందతాడవం, జతిశ్వరం, తిల్లానా, కృష్ణశబ్దం, తరంగం, కామాక్షిస్తుతి, స్వాగతంకృష్ణ లాంటి ఎన్నో అంశాలను లయశృతిబద్ధంగా అద్భుత హావభావాలను ప్రదర్శించి అవార్డులు, రివార్డులు అందుకు సాయిఅంకిత భామాకలాపం అంశాన్ని నేత్రపర్వంగా ప్రదర్శించి విచ్చేసిన అశేష కళాప్రియులు, ప్రేక్షకులను తన్నయుల్నిచేసి హర్షధ్వానాల మధ్య అందరి ప్రశంసలు, శుభాశీస్సులు అందుకుంది. అంకిత పలు కూచిపూడి నృత్యాంశాలకు తానే కొరియోగ్రఫీ చేసుకోవడం విశేషం. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రముఖ అతిథులు కళాకారులను జ్ఞాపికలతో సన్మానించి గురువు డా. కె.సాయిగీత కళాసేవను కొనియాడారు.

## ఇందిరమ్మ ఇళ్లతో పేదలకు మేలు

**ఘట్‌కేసర్, జూలై 30, ప్రభాతవార్త:** ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల జీవితాల్లో వెలుగులు నింపుతుందని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు మామిండ్ల ముత్యాలుయాదవ్‌లు అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ 6వ వార్డులోని బ్రూక్‌బాండ్‌కాలనీలో బుధవారం పలు ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేశారు. మాజీ చైర్‌పర్సన్ పావని జంగయ్యయాదవ్‌తో పాటు కాంగ్రెస్ అధ్యక్షులు ముత్యాలు యాదవ్‌లు లబ్దదారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి కొబ్బరికాయలు కొట్టి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రూ.5 లక్షలతో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తుందన్నారు. మున్సిపల్ పరిధిలోని కాలనీల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు చురుకుగా జరుగుతున్నాయని, లబ్దిదారులు సకాలంలో పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేయాలని వారు సూచించారు. ఈకార్యక్రమంలో డిసిసి కార్యదర్శి ఉల్లి అంజనేయులు, మైనారిటీసెల్ అధ్యక్షులు ఎం.ఎ.ఫారూఖ్, నాయకులు ఎండి.సిరాజుద్దిన్, జిల్లా మైనారిటీ నాయకులు ఎం.ఎ.రహమాన్, బొక్క సత్తిరెడ్డి, నర్సింగ్‌రావు, గోదా గణేశ్‌యాదవ్, సాయియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## రంగనాయకస్వామి సేవలో బిజెపి నాయకులు

**ఘట్‌కేసర్, జూలై 30, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ ఎదులాబాద్‌లోని శ్రీగోదాసమేత మన్నార్ రంగనాయకస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం నిత్యవిధి, మహాపూర్ణాహుతి, దేవతోద్వాపన, ద్వాదశారాధన, శ్రీపుష్పయాగం, సాయంత్రం గాంధోళీ ఉత్సవం, చక్రతీర్థం తదితర పూజలు జరిగాయి. ఆలయ ధర్మకర్తల మంత్రోచ్చారణాల మధ్య పూర్ణాహుతి, గాంధోళీ ఉత్సవ పూజలు నిర్వహించారు. గురువారం ఘటాభిషేకం, మహదాశీర్వచనం జరుగుతుందని వారు తెలిపారు. రంగనాయకస్వామిని పలువురు బిజెపి రాష్ట్ర, జిల్లా నాయకులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయగా అర్చకులు సన్మానించారు. మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షులు బుద్ది శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు పట్లోళ్ల విక్రమ్‌రెడ్డి, రాష్ట్ర ఓబీసీ మోర్చ నాయకులు కాలేరు రామోజీ, రాష్ట్ర కార్యవర్గసభ్యురాలు కొమ్మిడి శోభారాణి, మండలశాఖ అధ్యక్షులు బసవ రాజుగౌడ్, మున్సిపల్, మండల మాజీ అధ్యక్షులు విప్పర్ల హనుమాన్, చలువాది ప్రవీణ్‌రావు, మాజీ ఉపసర్పంచ్ కొమ్మిడి దామోదర్‌రెడ్డి, నాయకులు సాల్వేరు రఘు, పోలు భాస్కర్‌గౌడ్, మన్యం, కొమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, బెలే సురేశ్, కొత్తకాపు జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి నిధుల కేటాయింపు

**యూసుఫ్‌గూడ, జూలై 30, ప్రభాతవార్త :**

బస్తీల కాలనీల అభివృద్ధి కోసం అవసరమయ్యే విధంగా నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని అల్లాపూర్ కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని గాయిత్రినగర్‌లో 60 ఫీట్ల రోడ్డు సెంటర్ పార్క్ పనులను ఆమె పరిశీలించారు. జరిగే అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ రంజిత్, కాలనీ అధ్యక్షులు కృష్ణారావు, జితేందర్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

## అనునిత్యం ప్రజా సమస్యలపై పోరాడాలి

**యూసుఫ్‌గూడ, జూలై 30, ప్రభాతవార్త :**

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ప్రజల సమస్యలు తెలుసుకుని వారికి అన్ని వేళల అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు అన్నారు. బుధవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం సీనియర్ బీఆర్ఎస్ నాయకులు మాగంటి వజ్రనాథ్ మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే కృష్ణారావును కలిశారు. త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికలకు గాను బీఆర్ఎస్ పార్టీ తరఫున ఇంచార్జ్‌గా ఎర్రగడ్డ డివిజన్‌కు కృష్ణారావును నియమించటంతో ఆయనను కలవటం జరిగిందని మాగంటి వజ్రనాథ్ తెలిపారు. దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ ఆశయాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

## ప్రజా పాలనే కాంగ్రెస్ లక్ష్యం

**యూసుఫ్‌గూడ, జూలై 30, ప్రభాతవార్త**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని అహర్నిశలు ప్రజా సమస్యలకై పోరాటం జరుగుతుందని నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాజీ కార్పొరేటర్ మురళీగౌడ్ అన్నారు. రహమత్‌నగర్ డివిజన్ పరిధిలోని ఎస్పీఆర్ హిల్స్ కమలానగర్‌లో డబల్ బెడ్‌రూమ్ లబ్దిదారులతో కాంగ్రెస్ ప్రభుత్వం అందించే సన్నబియ్యంతో వండిన ఆహారాన్ని ఆ కుటుంబ సభ్యులతో కలిసి ఆరగించారు. పేద ఇంటి కళలను నెరవేర్చటంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వేళల కృషి చేస్తుందని తెలిపారు.

## విద్యార్థుల భద్రత కోసమే పాఠశాలలో సిసి కెమెరాలు

**-బిఆర్ఎస్ యువ నాయకుడు సాజిద్**



**కేశంపేట జూలై30, ప్రభాతవార్త :**

విద్యార్థుల భద్రత కోసమే సీసీ కెమెరాల ఏర్పాటును చేయించామని అన్నారు సంతపూర్ సాజిత్. బుధవారం కేశంపేట మండల పరిధిలోని సంతాపూర్ గ్రామానికి చెందిన బి ఆర్ ఎస్ యువ నాయకుడు సాజిద్ మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి ఆయన తన స్వంత ఖర్చుతో పాఠశాల ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని పాఠశాలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించేందుకు ముందుకు వచ్చిన సాజిత్ ను గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారి అశోక్ రెడ్డి, మాజీ సర్పంచ్ వరలక్ష్మి, ప్రభాకర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, పాఠశాల ఉపాధ్యాయులు అరుణ్, సుష్మ, శ్వేత, అంగన్వాడి టీచర్ శివలీల, గ్రామస్తులు రమేష్, బాల రాజు, మొకిత్ తదితరులు పాల్గొన్నారు. గ్రామస్థుల అభ్యున్నతికి యువత ముందుకు రావడం అభినందనీయం అని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం పాఠశాల భద్రత తో పాటు, విద్యార్థుల తల్లిదండ్రులలో నమ్మకాన్ని పెంచేలా ఉందని ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు.

## మూడు రోజులుగా కరెంట్ కోతలు ఇబ్బందులు పడుతున్న కడుమూరు,మిట్టకంకల్ గ్రామాల ప్రజలు

**పరిగి జూలై 30 ప్రభాతవార్త :**

పరిగి నియోజకవర్గం పూడూరు మండలంలోని కడుమూరు , మిట్టకంకల్ గ్రామాల ప్రజలు గత మూడు రోజులుగా కరెంటు కోతలతో ఇబ్బందులు పడుతున్నారు. మూడు రోజుల నుంచి కరెంటు ఎప్పుడు వస్తుందో లేదో తెలియట్లేదని, రెండు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు సమస్య ఏంటో తెలియనీయకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, కరెంటు కోతలతో నీటి సరఫరాకి, బోర్ల వాడకానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. రాత్రి సమయం లోనూ గ్రామాల్లోని ఒక కాలనీలో కరెంటు ఉంటే ఒక కాలనీ అంధకారం లో ఉంటుదని, విద్యార్థులు , ఉద్యోగులు సైతం ఇబ్బందులు పడుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. విద్యుత్ అధికారులు చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలి

**చార్మినార్, జూలై 30 ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు నిధులు త్వరగా మంజూరు చేయాలని కోరుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి జిహెచ్ఎంసి చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ వెంకన్నను కోరారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో అవసరం ఉన్న చోట రెండున్నర కోట్ల ఐదు లక్షల రూపాయల విలువ గల సిసి రోడ్లు అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రతి పాదనాలు రూపొందించిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని కోరుతూ తోకల శ్రీనివాస్ రెడ్డి చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ వెంకన్నను కలిసి బుధవారం వినతి పత్రం అందజేశారు. అభివృద్ధి పనులకు త్వరగా నిధులు మంజూరు చేస్తామని జోనల్ కమిషనర్ వెంకన్న హామి ఇచ్చారని తోకల శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

## ప్రజావాణి చారిత్రాత్మక నిర్ణయం

**హైదరాబాద్, జూలై 30, ప్రభాతవార్త:**

మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్ లో ప్రజావాణిని ప్రవేశపెట్టడం చారిత్రాత్మక నిర్ణయమని కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ పి.వి.రవి శేఖర్ రెడ్డి అన్నారు. ఇందుకు రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు .ప్రజా వాణి ఇంచార్జ్ గా తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ బోర్డు చైర్మన్ ,డాక్టర్ జి.చిన్నారెడ్డిని నియమించడంతో ప్రజల నుండి స్వయం గా దరఖాస్తులు స్వీకరించడం, వెంటనే ఫోన్‌లలో మాట్లాడి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం హర్షణీయమన్నారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు సామాన్య మానవుడికి చేరుతుండడం తో చిన్నారెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు.




## బిజెపి పట్టణ కమిటీ ఎన్నిక

**హుస్నాబాద్ టౌన్, జూలై 30, ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ పట్టణ కమిటీని పార్టీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు ఆధ్వర్యంలో బుధవారం ఎన్నుకున్నారు. పట్టణ ఉపాధ్యక్షులుగా వేల్పుల నాగార్జున్, బొడిగె వెంకటేష్, కాదాసు దీపిక, ప్రధాన కార్యదర్శులుగా గాదాసు రాం ప్రసాద్, పోలోజు రాజేంద్రచారి, కార్యదర్శులుగా లక్ష్మయ్య, ఆకోజు అరుణ కుమార్, సాయిరాం, కోశాధికారిగా బుర్ర రాజుతోపాటు 31 మంది కార్య వర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన కమిటీ సభ్యులకు శంకర్‌బాబు శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలి

### మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్


మాట్లాడుతున్న కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్

**హుస్నాబాద్ రూరల్, జూలై 30, ప్రభాతవార్త :** మహిళలు అన్ని రంగాల్లోనూ ఎదగాలని మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్ అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో 100 రోజుల ప్రణాళికలో భాగంగా మెప్మ(పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ) ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులు రుణాలు పొంది చేస్తున్న ఉత్పత్తులు, వ్యాపారాల ఫెస్టివల్ నిర్వ హించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోనే ఇందిరా మహిళా శక్తి, బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, మహిళా సంఘాల సభ్యులు వారి ఉత్పత్తుల, వృత్తులు, వ్యాపార సముదాయాల స్టాల్స్ ఏర్పాటు చేశారు. పట్టణంలో 503 సంఘాలు ఉంటే అందులో 23 సంఘాలకు రెండుకోట్ల రుణాలు అందిచినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎడిఎంసి సంతోషిమాత, మున్సి పల్ మేనేజరు సంపత్‌రావు, సిబ్బంది, ఆర్పిలు, ఒబిలు పాల్గొన్నారు.

### కార్మికుల ఆరోగ్యం కాపాడుకుంటాం...

**హుస్నాబాద్ రూరల్, జూలై 30, ప్రభాతవార్త :** పరిశుభ్రం కోసం శ్రమించే కార్మికులతోపాటు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుకుంటామని మున్సి పల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్ అన్నారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కరీంనగర్ మెడ్ కవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మి కులు, అధికారులతో పాటు ప్రజలకు రక్త పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్నవారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం మున్సిపల్ కార్మికులకు సిపిఆర్ చేసే విధానం గురించి వివరించారు. ఈ శిబిరంలో ఆసుపత్రి నిర్వాహకులు గుర్రం కిరణ్, మున్సిపల్ మేనేజరు సంపత్‌రావు, హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజరు కర్ణాకర్, అసిస్టెంట్ మేనేజరు శ్రీకాంత్‌తో పాటు మున్సిపల్ అధికారులు ఉన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి

### మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్‌చరణ్‌రెడ్డి


ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకుంటున్న శ్రీరామ్‌చరణ్‌రెడ్డి

**నర్సాపూర్, జూలై 30, ప్రభాతవార్త:** మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కమిషనర్ శ్రీరామ్‌చరణ్ రెడ్డి అన్నారు. బుధవారం 3వ వార్డులో నెలకొన్న డ్రైనేజ్, పారిశుధ్య సమస్యలను కాలనీ వాసులు మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్ళారు వెంటనే స్పందించిన ఆయన కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. వార్డులో ఏ సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కాలనీ వాసులకు సూచించారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ రాములు, కాలనీ వాసులు ఆనంద్‌కుమార్, హయాన్, ఇమ్రాన్, అక్రమ్, పాముల కిషన్ మున్సిపల్ సిబ్బంది వినీత్, రామే రాజు తదితరులు ఉన్నారు .

### యూరియా కోసం రైతుల ఇబ్బందులు..పట్టించుకోని అధికారులు


యూరియా కోసం ఎదురు చూస్తున్న రైతులు

**చిన్నకోడూరు, జూలై 30,ప్రభాతవార్త :** మండల కేంద్రంలో రైతులు యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యూరియా కోసం రైతులు రోజుల తరబడి ఎదురుచూస్తున్న పరిష్కారానికి దారి దొరకడం లేదు..రైతులు ఫర్టిలైజర్ షాపుల వద్ద బారులు తీరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఓ వైపు యూరియా కొరత లేదని చెప్తున్నా ఇక్కడ మాత్ర యూరియ దొరకడం లేదని రైతులు వాపోతున్నారు. యూరియా కోసం ఫర్టిలైజర్ షాపుల వద్ద బారులు తీరాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి యూరియా కొరత లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

### పొగాకు వాడొద్దు.. విద్యార్థుల అవగాహన ర్యాలీ

**సిద్దిపేట రూరల్, జూలై 30, ప్రభాతవార్త :** టొబాకో ఫ్రీ స్కూల్ చాలెంజ్‌లో భాగంగా బుధవారం సిద్దిపేటలోని సెలెస్టియల్ ఇంగ్లీష్ మీడి యం హైస్కూల్ విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. పొగ పీల్చ రాదని..పొగాకు ఉత్పత్తులతో ఆరోగ్యానికి హానిఅంటూ నినాదాలు చేశారు. అంతకు ముందు పాఠశాలలో నాటక, వ్యాసరచన, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్లు వై.హన్మంతరెడ్డి, బి.శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ కె.విక్రమ్‌రెడ్డి, సంతోషం తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

# మంత్రిని విమర్శించే నైతిక హక్కు బిఆర్ఎస్ నాయకులకు లేదు


మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అత్తు

**సిద్దిపేట అర్బన్, జూలై 30, ప్రభాతవార్త:** రాష్ట్ర కార్మిక, భూగర్భ గనులశాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని విమర్శించే స్థాయి బిఆర్ఎస్ నాయకులకు లేదని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎం.డి.ఇమామ్(అత్తు) అన్నారు. సిద్దిపేట లో బుధవారం ఆయన మాట్లాడుతూ, సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ సర్కారు పేదల కోసం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పను లను మంత్రి వివేక్‌వెంకటస్వామి ప్రజలకు వివరి స్తుంటే జీర్ణించుకోలేకపోతున్నారని మండిపడ్డారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో పేదలకు ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని పేదలకు రేషన్ కార్డులు ఇచ్చామని బిఆర్ఎస్ నాయకులు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. బిఆర్ఎస్ హయాంలో ఎవరికి రేషన్ కార్డులో ఇచ్చారో బహిరంగ చర్చకురావాలని సవాల్ విసిరారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో రైతులకు ఏమాత్రం మేలు జరగలేదని కెసిఆర్ కుటుంబ సభ్యులకు మాత్రం మేలు జరిగిందన్నారు. కాళేశ్వరం పేరిట డబ్బులు దండుకున్నారే తప్ప రైతులకు ఒరగబెట్టిం దేమిలేదని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేరుస్తూ ప్రజాపాలనను చూసి బిఆర్ఎస్ నాయ కులు ఓర్వలేక సిఎంను,ప్రభుత్వాన్ని బదనాం చేస్తు న్నారని తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డినిగానీ మెదక్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకట స్వామిని విమర్శిస్తే సహించేదిలేదని హెచ్చరిం చారు. పేదల సంక్షేమమే కాంగ్రెస్ సర్కారు ధ్యేయ మన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు మధు, గయాజుద్దీన్, హర్షద్, రాజిరెడ్డి, రవితేజ, మునీ రుద్దీన్, స్నేహిత్, ఫయాజ్ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ

**కల్హేర్, జూలై 30,(ప్రభాతవార్త) :** కల్హేర్ మండల్ ఖానాపూర్ (కె)గ్రామంలో ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ఆదేశానుసారం ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేయడం జరిగింది. ఖానాపూర్ (కె) గ్రామానికి చెందిన నాగురి వినోద, ఎర్ర మార్తమ్మ, బేగారి నాగమణి ఇళ్లకు భూమి పూజ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఖానాపూర్(కె) గ్రామ, కల్హేర్ మండల యూత్ కాంగ్రెస్ నాయ కులు మాసాన్‌పల్లి కృష్ణ ముధీరాజ్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి పేదవాడికి ఇల్లు అందిస్తుందన్నారు ఖానాపూర్ గ్రామ ప్రజల తరుపున ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. వారితోపాటు బెగరి సాయిలు, నర్వ ఉదయ్ సాగర్, బాల్లయ్య, విఠల్, దయాకర్ ప్రతినిదులు పంచాయతీ కార్యదర్శి పవన్ కుమార్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## బిసి రిజర్వేషన్ బిల్లుకు బిజెపి వ్యతిరేకం

### సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు టిస్కెలాబ్ బాబు

**చేర్యాల, జూలై 30,ప్రభాతవార్త :** బిసి రిజర్వేషన్ బిల్లుకు బిజెపి మోకాలు అడ్డుపెడుతుందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు టిస్కెలాబ్ బాబు ఆరో పించారు. బుధవారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సమా వేశంలో చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, దూళిమిట్ట మండలాల నాయకుల, కార్యకర్తలకు రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించగా సిపిఎం జిల్లా కార్య దర్శి వర్గ సభ్యులు శెట్టిపల్లి సత్తిరెడ్డి ప్రిన్సిపల్‌గా వ్యవహరించగా ముఖ్య అతిథిగా టిస్కెలాబ్ బాబు పాల్గొని మాట్లాడుతూ విద్వేషాలు రెచ్చగొట్టి మతాల,కులాల మధ్య సృష్టిస్తూ ప్రజల ఐక్యతను విడదీసి దేశ ఐక్యతను దెబ్బతీస్తున్నారన్నారు.బిసి బిల్లు విషయంలో బిజెపి బలహీన వర్గాలకు బద్ద శత్రువుగా వ్యవహరిస్తుందని,బలహీన వర్గాల పట్ల చిత్తశుద్ధి ఉంటే తక్షణమే పార్లమెంట్‌లో బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేశారు.పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, నక్కల యాదవరెడ్డి, రాళ్ళబండి శశిధర్, కొంగరి వెంకటమావో, ఆలేటి యాదగిరి, బండకింది అరుణ్‌కుమార్, తాడూరి రవీందర్, బద్దిపడిగ కృష్ణారెడ్డి, దాసరి ప్రశాంత్, జాలిగాపు శిరీష, రాళ్ళబండి నాగరాజు, షఫి, పోతిరెడ్డి రాజు, తేలు ఇస్తారి, బక్కిలి బాలకిషన్, పోలోజు శ్రీహరి ఇప్పకాయల శోభ తదితరులు పాల్గొన్నారు.

### బిఆర్ఎస్ హయాంలో డబుల్‌బెడ్ రూంలు

## ఇవ్వలేదనడం సరికాదు : లింగంగౌడ్


మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

**నంగునూర్, జూలై 30, ప్రభాతవార్త :** బిఆర్ఎస్ హయాంలో డబుల్‌బెడ్ రూంలు ఇవ్వలేదని ఇన్‌చార్జి మంత్రి వివేక్‌వెంకటస్వామి మాట్లాడడం సరికా దని బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు అనగోని లింగంగౌడ్ అన్నారు. బుధ వారం నంగునూర్‌లో విలేకరులతో మాట్లాడారు. బిఆర్ఎస్ పాలనలో 647. 479 రేషన్‌కార్డులను మంజూరు చేసి పేదలకు అందించడం జరిగిందన్నారు. సిద్దిపేట అభివృద్ధి తెలియకుండా ఇన్‌చార్జి అర్థం లేకుండా వ్యాఖ్యాలు చేయ డం మానుకోవాలన్నారు. మల్లన్నసాగర్ ద్వారా వ్యవసాయానికి సాగునీరు అందడంతో పాటు ఇతర జిల్లాలకు తాగునీరు అందుతుందన్నారు. ఇన్‌చార్జి మంత్రి అబద్దాలు మాట్లాడడం మానుకోవాలన్నారు. కెసిఆర్ ప్రభుత్వ హయాం లో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు దేశానికే ఆదర్శంగా నిలిచా యన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు జాప శ్రీకాంత్‌రెడినడ, రాగుల సారయ్య, ఎడ్ల సోమిరెడినడ, కోల రమేష్‌గౌడ్, తిరుపతి, పరుశరాములు, కృష్ణారెడినడ, పురేందర్, మహేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### భూభారతి దరఖాస్తుల పరిష్కారంలో అధికారుల నిమగ్నం

**సంగారెడ్డి మున్సిపాలిటీ జూలై 30 ప్రపోతవార్త:** భూభారతి గ్రామసభలలో వచ్చిన దరఖాస్తుల పరిష్కార గడువు సమీపిస్తుదడంతో జిల్లా రెవెన్యూ యంత్రాంగం దరఖాస్తు ల, పరిష్కారంలో నిమగ్నమైంది దరఖాస్తులు ఎక్కువగా ఉండే సమయం తక్కువగా ఉండటంతో ప్రత్యేక కార్యచరణను చేపట్టారు. సంగారెడ్డి రెవెన్యూ డివిజన్ పరిధిలో సుమారుగా 7,500 దరఖాస్తులు వచ్చాయి. వీటిని పరిష్కరించేందుకు డివిజన్ పరిధిలోని తాసిల్దార్లు ఇతర సిబ్బందిని సంగారెడ్డి ఆర్టీవో కార్యాలయంలోనే దరఖాస్తులు పరిశీలించేలా ఏర్పాట్లు చేశారు. పాత జిల్లా పరిషత్ సమావేశ మందిరం మరియు ఆర్డీవో కార్యాలయం ఇతర గదులను ఒక్కొక్క మండలానికి కేటాయించారు అక్కడే అధికారులు సిబ్బంది దరఖాస్తులను పరిష్కారం కొరకు కార్యచరణ చేపట్టారు. ఇతర పని దినాలతో పాటు సెలవు రోజులలో కూడా విధులు నిర్వహిస్తూ రాత్రి పొద్దు పోయేవరకు పనులు చేస్తున్నారు. వచ్చేనెల 14 లోగా భూభారతి దరఖాస్తులు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించిన సంగతి తెలిసిందే.


సమస్యలు తెలుసుకుంటున్న నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి

### సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

### కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి

**నర్సాపూర్ జూలై 30, ప్రభాతవార్త:** నమస్తే నర్సాపూర్ కార్యక్రమంతో ప్రజల్లో నమ్మకం విశ్వాసం కలిగిందని దీంతో పట్టణంలో పెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి అన్నారు బుధవారం నమస్తే నర్సాపూర్ కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 1,2,3 వ వార్డుల్లో నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి వార్డులో ని ఇంటింటికి తిరుగుతూ ప్రజలతో నేరుగా మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకుంటూ వార్డుల్లో నెలకొన్న సమస్యలపై స్పందించి వాటిని తక్షణమే పరిష్కరించే విధంగా సంబంధిత అధికారులను తగు చర్యలు తీసుకోవాలని రాజిరెడ్డి ఆదేశించారు అదేవిధంగా వార్డుల్లో ప్రజలతో నేరుగా మమేకమవుతూ సమస్యలపై స్పందించే ఆవుల రాజిరెడ్డి తీరుపై ఆయన శైలిపై స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు నమస్తే నర్సాపూర్ కార్యక్రమం తో రాజిరెడ్డిపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని ఇదే నిజమైన ప్రజానాయకత్వం అని పలువురుఅభిప్రాయపడుతున్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గుర్రాల మల్లేశం, మాజీ జెడ్పిటి శ్రీనివాస్ గుప్తా, నాయకులు హబీబ్ ఖాన్, రవిశంకర్, సుధీర్‌కుమార్ గౌడ్, కుమ్మరి నాగేష్, కుమ్మరి సురేష్, నరేందర్ రెడ్డి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### అమ్మవార్ల దీవెనతో ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలి

### కౌన్సిలర్ కాటం శోభరఘురామ్


అమ్మకు ఒడి బియ్యం కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

**సిద్దిపేట అర్బన్, జూలై 30, ప్రభాతవార్త :** సిద్దిపేట పట్టణంలోని 42వ వార్డులో రిలయన్స్ స్మార్ట్ వద్ద బత్తిని అపార్ట్‌మెంట్‌లో మనసారా మన అమ్మ కు ఒడి బియ్యం కార్యక్రమం బుధవారం కౌన్సిలర్ కాటం శోభరఘురామ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ప్రతినెల ఒక్కొక్క అమ్మవారికి ఒడి బియ్యం అందాలని గత రెండు యేండ్ల నుంచి సమర్పించడం జరుగుతుందన్నారు. వార్డులోని మహిళలంతా సామూహిక లలితా సహస్ర నామ పారాయణం చేసి ఒడి బియ్యం కలిపి చీర సారే పూలు, పండ్లు, గాజులతో మెదక్ రోడ్డులోని బంగారు మైసమ్మ దేవాలయంకు వెళ్లి అమ్మవారికి సమర్పించారు. లోక కళ్యాణార్థం కార్యక్రమం నిర్వహించినట్లు కౌన్సిలర్ శోభరఘురామ్ తెలిపారు. పిల్లాపాలతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని అమ్మవార్లను వేడుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వార్డు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

### ఆయిల్‌పామ్ సాగు రైతులకు ఒక వరం : ఎడిఎ

**నర్సాపూర్ జూలై 30, ప్రభాతవార్త:** ఆయిల్‌పామ్ సాగు రైతులకు ఒక వరం లాంటిదని ఏడిఏ సంధ్యారాణి అన్నారు. బుధవారం నత్నయపల్లి గ్రామానికి చెందిన రైతు శరత్ సాగుచేసిన ఆయిల్‌పామ్ పంటను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు. రైతులు డ్రిప్ లో పాగు చేస్తె ఎస్సీ ఎస్టీలకు 100 శాతం, బిసి లకు 90 శాతం, ఓసీలకు 80 శాతం సబ్సిడీ అందిస్తుందన్నారు. ఆయిల్ ఫామ్ సాగుకు ఒక చెట్టుకు రెండు వందల రూపాయల ధర ఉంటే ప్రభుత్వం రైతులకు రూ. 20 రూపాయలకే అందిస్తుందన్నారు. ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్న రైతులకు రైతుబంధు తో పాటు సంవత్సరానికి 4,200 రూపాయిలు ఎకరానికి సాగు ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఒక ఎకరం ఆయిల్ ఫామ్ సాగులో 57 చెట్లు వేసుకోవచ్చని తెలిపారు. ఆయిల్ ఫామ్ వెయ్యాలనుకునే రైతులు మండల వ్యవసాయ శాఖ కార్యాలయానికి వచ్చి వివరాలు తెలుసుకోవచ్చని అదేవిధంగా 8977725906 ఫోన్ నెంబర్‌కు కాల్ చేసి సంప్రదించాలని ఏ డి ఏ సంధ్యారాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు నర్సాపూర్ ఏవో దీపిక, శివంపేట ఏవో లావణ్య, ఏ ఈ ఓ దుర్గాప్రసాద్, కంపెనీ ప్రతినిధి అజయ్ కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు

# ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

### బిఆర్ఎస్ నాయకులు


మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

**సిద్దిపేట రూరల్, జూలై 30, ప్రభాతవార్త :** ప్రజా సంక్షేమం.. అభివృద్ధిపై సిఎం రేవంత్‌రెడ్డి తో పాటు మంత్రులకు కనీస అవగాహన లేకుండా పాలన సాగిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారే తప్ప ఒరగబెట్టేదేమిలేదని బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణశర్మ, చిన్నకోడూరు మండల పార్టీ అధ్యక్షులు కాముని శ్రీనివాస్ మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయంలో బుధ వారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు గుండు భూపేష్, మోహన్ లాల్, రమేష్‌గౌడ్, సోమిరెడ్డి, ఎర్ర యాదయ్య, పాపాయ్య, జంగిటి శ్రీనివాస్‌లతో కలిసి వారు మాట్లాడారు. కార్మిక, భూగర్భగనుల, జిల్లా ఇన్ చార్జి మంత్రి వివేక్‌వెంకటస్వామికి జిల్లాపై జిల్లా ప్రజల అవసరాలపై కనీస అవగాహన లేదన్నారు. ఇన్‌చార్జి మంత్రి సిద్దిపేటకు వచ్చి ఇష్టానుసారంగా అవగాహన లేకుండా అవివేకంగా వ్యాఖ్యాలు చేస్తున్నారే తప్పు జిల్లాకు మంచి చేయలనే కనీస జ్ఞానం లేదన్నారు. జిల్లా ప్రజల అవసరాలను గుర్తించకుండా, ఎరువుల కొరత లేదని మల్లన్న సాగర్ ప్రాజెక్టు అవసరం లేదని మంత్రి వివేక్ కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని మండి పడ్డారు. బిఆర్ఎస్ హయాంలో కెసిఆర్ నిర్మించిన మల్లన్నప్రాజెక్టు ద్వారా హైదారాబాద్, జనగామ, సిద్దిపేట, యాదాద్రిభువనగిరి జిల్లాకు తాగునీరు అందిస్తున్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. మల్లన్న సాగర్ ఎందుకు అని మాట్లాడడం సిగ్గుచేట న్నారు. అబద్దాలు చెప్పి రాజకీయ లబ్దిపొందాలని కాంగ్రెస్ నాయకులు చూస్తున్నారే తప్ప ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేద న్నారు. గతంలో వివేక్‌వెంకటస్వామి తండ్రిని ఆద రించి సిద్దిపేట ప్రజలు ఎంపిని చేశారని తండ్రి వెంట నడిచిన ప్రజల రుణం తీర్చుకోవాలి తప్ప కనీస అవగాహన లేకుండా మాట్లాడడం సరికాద న్నారు. అభివృద్ది పట్ల అవగాహన లేకుండా జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా సిద్దిపేట ప్రజలను మోసం చేయడానికి సిద్దిపేటకు వస్తున్నారా అని ప్రశ్నిం చారు. సిద్దిపేట ప్రాంత ప్రజల పట్ల వివక్ష చూప డానికి అక్కసుకక్కడానికి వస్తే చూస్తూ ఉరుకోరని హెచ్చరించారు. బిఆర్ఎస్ హయాంలో ఎరువుల, కరెంటు కొరత లేదని తెలిపారు. సిద్దిపేటలో ఎరువుల కొరత లేదని మంత్రి మాట్లాడం సరికాదన్నారు. సిద్దిపేట ప్రజలకు డబుల్‌బెడ్ రూం ఇండ్లు, రేషన్‌కార్డులు బిఆర్ఎస్ హయాంలో అం దించడం జరిగిందని గుర్తు చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


గుంతలమయమైన రోడ్డు దృశ్యం

## గుంతలమయం చెరువుముందు తండా రోడ్డు

**అక్కన్నపేట, జూలై 30, ప్రభాతవార్త :** మండలంలోని కేశాయక్‌తండా గ్రామ పంచాయతీ పరిధిలోని చెరువుముందు తండా వెళ్లే మట్టి దారి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తెలిపోయి గుంతలమయంగా మారిందని ఈ గుంతలతో తండాకు వెళ్లే వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గుంతలమయైన రోడ్డుపై మట్టి పొయించండి సారూ అని పంచాయతీ కార్యదర్శిని వేడుకుంటే గ్రామ పంచాయతీలో నిధులు లేవని దాటవేస్తున్నారని, వర్షాలకు ఏర్పడిన గుంతలను పూడ్చకుంటే వాహణదారులకు ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాద్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. గుంతలమయమైన రోడ్డుపై మట్టి కొట్టించి చదును చేసి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని అధికారులు, నాయకులను తండా వాసులు వేడుకుంటున్నారు.

### నాగారం నుంచి ఉమ్మాపూర్‌కు

### బిటిరోడ్డు మంజూరు చేయండి : మల్లిఖార్జునరెడ్డి


గుంతలు పడిన రోడ్డును పరిశీలిస్తున్న బిఆర్ఎస్ నేతలు

**హుస్నాబాద్ రూరల్, జూలై 30, ప్రభాతవార్త :** మండలంలోని నాగా రం గ్రామం నుండి ఉమ్మాపూర్ వరకు ప్రభుత్వం బిటి రోడ్డు మంజూరు చేయాలని బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లిఖార్జునరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలమయైన రోడ్డును పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. ఉమ్మాపూర్ నుండి నాగారం వరకు బిటి రోడ్డు లేకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు గుంతమయమై ప్రజలు, ప్రయాణికులు, వాహణదారులు ఇబ్బందులు పడు తున్నారని ఈ విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి బిటి రోడ్డు మంజూరు చేసి గ్రామస్థుల ఇబ్బందులను తొలగించాలన్నారు. రోడ్డును పరి శీలించిన వారిలో బిఆర్ఎస్ నాయకులు మేకల వికాస్‌యాదవ్, సంజీవ్, మల్లేష్, రాకేష్, సుధాకర్, రాజు, కుమార్, అభిషేక్ ఉన్నారు.

## వరిలో సస్య రక్షణ చర్యలు పాటించాలి

### ఎఇవో సబిహా

**అక్కన్నపేట, జూలై 30, ప్రభాతవార్త :** వరి సాగులో రైతులు సస్య రక్షణ చర్యలు తీసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి సబిహా అన్నారు. బుధవారం గొల్లకుంట గ్రామంలో వరిపంటను సాగు చేసిన రైతుల పొలా లను సందర్శించారు. వరిలో పురుగుల నివారణకు నారు పీకే వారం రోజుల ముందే రెండు గుంట నారుమడికి 800ల గ్రాముల కార్ఫోఫ్యూరన్ 3జి గులికలను చల్లి నీటిని అదే మడిలో ఇంకేటట్లు చూడాలన్నారు. వరి నాటే సమయంలో ప్రధానంగా నారు కొనలను తుంచి నాటాలని సూచించారు. వరి సాగు విషయంలో వెదజల్లె పద్దతి ద్వార రైతులు అధిక దిగుబడి పొందే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా వరిలో వచ్చే రోగాలు వాటికి వాడాల్సిన ఎరువులను గురించి రైతులకు వివరించారు.

## విద్యార్థులకు అల్పాహారం పంపిణీ

**మర్కుక్, జూలై 30 (ప్రభాతవార్త):** లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మైత్రిఅధ్యక్షుడు లయన్ ఎం.రమణారావు ఆధ్వర్యంలో బుధవారం మర్కుక్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 350 మంది విద్యార్థులకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్న బందు బిరుదాంకితులు, ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ డైరెక్టర్ ఘట్టమనేని బాబురావు జన్మదినం సందర్భంగా లయన్స్ ఇంటర్నేషనల్ డిస్టిక్ 320డి గవర్నర్ లయన్ అమర్నాథ్‌రావు చేతులమీదుగా అల్పాహారం పంపిణీ చేసి నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.వెంకటేశం, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సరిత, పిఆర్‌టియు మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు భూజాత, రమేష్, గణేష్, పిఇటి స్వామి, లయన్ యాదిరెడ్డి పాల్గొన్నారు.

### మృతుల కుటుంబాలను పరామర్శించిన సిపిఐ నేతలు

**చేర్యాల, జూలై 30, ప్రభాతవార్త :** ఇటీవల మృతిచెందినవారి కుటుంబా లను సిపిఐ నాయకులు పరామర్శించారు. బుధవారం మండలంలోని ముస్త్యాల గ్రామానికి చెందిన సిపిఐ నాయకులు చేరాల బాలయ్య, చేర్యాల పట్టణానికి చెందిన బొడ్డు భరత్, కూరెళ్ల తిరుపతిగౌడ్ మృతి చెందగా వారి కుటుంబాలను పరామర్శించి సానుభూతి తెలిపారు. అలాగే పట్టణానికి చెందిన సిపిఐ పట్టణ మాజీ కార్యదర్శి అనారోగ్యంతో బాధపడి ఇంటి వద్దే విశ్రాంతి తీసుకుంటుండగా అతనిని పరామర్శించారు. ఈరిభూమయ్య, నంగి కనకయ్య, గూడెపు సుదర్శన్, మనెపల్లి కిష్టయ్య, కర్రె నర్సిరెడ్డి, స్వామి దాసు, హరీష్, రాములు తదితరులు ఉన్నారు.

### బాధితులకు ఫోన్లు అందజేత

**హుస్నాబాద్ రూరల్, జూలై 30, ప్రభాతవార్త :** సెల్‌ఫోన్లు పోగొట్టుకుని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన 13 మంది బాదితుల సెల్‌ఫోన్లను హుస్నాబాద్ పోలీసులు స్వాదీనం చేసుకుని బుధవారం రోజున హుస్నాబాద్ ఎసిపి సొదారపు సదానందం చేతుల మీదుగా బాదితులకు అందజేశారు. వివరాల్లోకి వెళ్తే హుస్నాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో కొద్ది రోజుల క్రితం సెల్ ఫోన్లను కొంత మంది పోగొట్టుకోగా, మరి కొందరి ఫోన్లు దొంగిలించబడగా హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే ఫిర్యాదులు స్వీకరించి పోలీసులు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టార్)లో నమోదు చేసి ఆ ఫోన్లను రికవరీ చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఎసిపి సదానందం మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న, దొంగతనానికి గురైనా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆ సెల్‌ఫోన్లు ఎక్కడ ఉన్నా పట్టుకుని బాదితులకు అందజేయడం జరుగుతుందన్నారు. అయితే సెల్‌ఫోన్లు తీసుకున్న బాదితులు పోయిన ఫోన్ దొరుకుతుందో లేదో అని భయపడ్డామని రికవరీ చేసి వారి ఫోన్లను వారికి అందియడం పట్ల వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. బాదితులకు సెల్‌ఫోన్లు అందించిన వారిలో హుస్నాబాద్ సిఐ కొండ్ర శ్రీనివాస్, ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి, సిబ్బంది బరిగెల కుమార్, ప్రియాంకతో పాటు తదితరులు ఉన్నారు.


బాధితులకు సెల్‌ఫోన్లు అందిస్తున్న ఎసిపి సొదారపు సదానందం

# కుండలెన్ని చేసినా కూటికి కరువే

**మట్టిపాత్రలకు తగ్గిన డిమాండ్**
**మార్కెట్‌ను ముంచెత్తుతున్న స్టీల్, ప్లాస్టిక్ వస్తువులు**
**ఉపాధి కోసం కులవృత్తికి స్వస్తి చెబుతున్న కుమ్మరులు**



**కోట్‌పల్లి, జూలై 30, ప్రభాతవార్త:** శుభకార్యాలు, అశుభ కార్యమైనా ముందుగా వాడేది మట్టి పాత్రలే. ఆ పాత్రలు తయారు చేసే కుమ్మరుల పరిస్థితి నేడు ఆగమ్యగోచరంగా మారింది. వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి, బంట్వారం మండలాల్లో దాదాపు 50 కుటుంబాలు ఉండగా కులవృత్తినే ఆధారంగా చేసుకొని 25పైగా కుటుంబాలు జీవిస్తున్నాయి. కోట్‌పల్లి మండలంలోని కోట్‌పల్లి, బంట్వారం, మోత్కుపల్లి, బార్వాద్ గ్రామాలల్లో కొంతమంది కులవృత్తిని కొనసాగిస్తున్నారు. మట్టితో సారెపై వివిధ రకాల మట్టిపాత్రలను తయారు చేస్తు న్నారు. వాటి తయారీకి వినియోగించే నల్లటి మొత్తటి మట్టి కొంతకాలంగా ట్రాక్టర్ల ద్వారా సంగారెడ్డి జిల్లా సదాశివపేట్ నుంచి తెచ్చుకుంటున్నారు. ఒక్కో ట్రాక్టరుకు రూ.15, వేల నుంచి రూ.20,వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోందని కుమ్మరులు పేర్కొన్నారు. ఒండ్రుమట్టిని చూర్ణం చేయటం నుంచి సారెపై పెట్టి పాత్రలను తయారు చేసే ఈ పనుల్లో కుటుంబ సభ్యులంతా కష్టపడతారు. మట్టితో కుండలు, కంచులు, గురుగులు, దీపపు ప్రమిదలు, వంట వండే పాత్రలను తయారు చేస్తున్నారు. అయితే వాటిని విక్రయిం చడం ఇబ్బందిగా మారిందని కార్మికులు తెలిపారు. రెడిమెట్, ప్లాసిక్, వస్తువులు, అల్యూ మినియం, స్టీల్ పాత్రలు, మార్కెట్‌లోకి రావడంతో మట్టితో తయారు చేసిన పాత్రలకు గిరాకీ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. పండుగలు, జాతర్లు, శుభ, అశుభ, కార్యక్రమాలకు మాత్రమే కొనుగోళ్లు చేస్తున్నట్లు తెలిపారు. మిగుతా రోజుల్లో పెద్దగా గిరాకీ ఉండదని వివరించారు. దీంతో ఉపాధి కరువై ఇతర వృత్తుల్లోకి వెళ్తున్న తరుణంలో కుమ్మరులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. మట్టితో చేసిన వస్తువులు విక్రయించెందుకు ఏర్పాట్లు చేయాలని అందుకు తగ్గ చర్యలు ప్రభుత్వం తీసుకోవాలని కుమ్మరులు కోరుతున్నారు.



మట్టిపాత్రను తయ్యారు చేస్తున్న కార్మికుడు



మార్కెట్ లేక నిరుపయోగంగా ఉన్న మట్టి కుండలు

**నాలుగు దశాబ్దాలుగా వృత్తిలో...**

కోట్‌పల్లి మండలం మోత్కుపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి హన్మయ్య వయస్సు 70 సంవత్సరాలు. అయనకు భార్య కూమారుడు, కూతురు. 18 సంవత్సరాల వయసు నుంచి కుల వృత్తిని చేపట్టారు. వయస్సు మీద పడినా వృత్తిని మాత్రం విడవలేదు. కూమారుడు కుడా తండ్రికి ఆస రాగా ఉంటూ ఇదే కులవృత్తిలో కోనసా గిస్తు న్నాడు.

## 2న చేవెళ్లకు మందకృష్ణ రాక

**చేవెళ్ల, జూలై 30, ప్రభాతవార్త:** సిఎం రేవంత్ రెడ్డి పెన్షన్‌పై ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చేవెళ్లలో ఆగస్టు 2న నిర్వహించే కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పాల్గొననున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్ మాదిగ బుధవారం తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి వికలాంగులు వృద్ధులు పెద్ద సంఖ్యల హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## ఓపిఎస్ విధానాన్ని పునరుద్ధరించాలి

**చేవెళ్ల, జూలై 30, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా శంకర్ పల్లి, మహాలింగాపురం, రావులపల్లి, పర్వేద ఉన్నత పాఠశాలలు, వివిధ ప్రైమర్ స్కూల్ లో బుధవారం సభ్యత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కోట్ల కాశీరావు, జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపిఎస్ విధానాన్ని అమలు చేయాలి 317 జీవోలో భాగంగా స్థానికత కోల్పోయిన వారికి స్థానికతను కల్పించి న్యాయం చేయాలన్నారు. 2003 డీఎస్సీ వారికి వెంటనే ఓపిఎస్ విధానాన్ని అమలు చేయాలి కోర్టు తీర్పు అనుకూలంగా వారికే వచ్చినందువలన దాన్ని వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని మేము డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షప్రధాన కార్యదర్శులు జంగయ్య, శ్రీను, కార్యదర్శులు బసవరాజ్, శ్రీనివాస్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాజిరెడ్డి కుటుంబానికి స్పీకర్ పరామర్శ

**మర్పల్లి జులై 30 ప్రభాతవార్త :** మర్పల్లి మండలంలోని సిరిపూరం గ్రామానికి చెందిన మర్రి రాజిరెడ్డి కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షులు మృతి చెందడంతో బుదవారం నాడు స్పీకర్ గడం ప్రసాద్‌కుమాం సిరిపూరంకు చేరుకొని రాజిరెడ్డి పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబాన్ని పరామర్శించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు.

## గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ

**దౌల్తాబాద్, జూలై 30 ప్రభాతవార్త:** దౌల్తాబాద్ మండలంలోని చెల్లాపూర్ గ్రామంలో బుధవారం స్థానిక నాయకులు నూతన గ్రామపంచాయితీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్య క్రమంలో పంచాయితీరాజ్ ఏఈ నాగేందర్, మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, మాజీ జడ్పీ టీసీ వెంకటమ్మ పకీరప్ప, మాజీ సర్పంచులు కిస్తమ్మా బాల్‌రాజ్,శరణయ్య, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లేష్,గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజప్ప, పట్నం శివకుమార్, నల్గొండ చంద్రశేకర్, డీలర్ వెంకటప్ప, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**పరిగి, జూలై 30 ప్రభాతవార్త :** పరిగి పట్టణం ప్రభుత్వ ఆసుపత్రి ముందు బుధవారం మోటార్ సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని డీసీఎం ఢీకొనడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు నవాపేట్ గ్రామానికికి చెందిన శ్రీనివాస్‌గా పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై మోహన్ కృష్ణ తెలిపారు.

## ముదిరాజ్‌లను బిసి-ఎలో చేర్చాలి

**కొడంగల్, జూలై 30 ప్రభాతవార్త :** ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏలో చేర్చాలని ముదిరాజ్ సంఘం ఉమ్మడి పాలమూరు జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్ డిమాండ్ చేశారు.బుధవారం పట్టణంలోని రెడ్డిబసిరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ముదిరాజ్‌ల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ముదిరాజ్‌ల జనాభాకు అనుగుణంగా విద్యా, ఉద్యోగ రాజకీయాల్లో ప్రభుత్వం అవకాశం కల్పించాలన్నారు. ముదిరాజ్‌లను బీసీ ఏలో చేర్చాలని డిమాండ్‌తో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే విధంగా ఆగష్టు 20న కొడంగల్‌లో భారీ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.సమావేశంలో సంఘం తాలూకా అధ్యక్షులు నర్సిములు, సత్యపాల్, తుడుం శ్రీనివాస్, మెరుగు వెంకటయ్య, బాబయ్య, బురాన్‌పూర్ నారాయణ,కూర వెంకటయ్య, యాదగిరి, బాబయ్యనాయుడు, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోండి

**పెద్దేముల్, జూలై 30, ప్రభాతవార్త:** దేశ ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేసే ఏకైక పార్టీ బిజేపేనని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉప్పరి రమేష్ కుమార్ అన్నారు. బుధవారం పెద్దేముల్ మండలం రుక్మాపూర్ గ్రామంలో ఎంపి నిధులు రూ. 5 లక్షలతో సీసీ రొడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్బంగా యు.రమేష్ మాట్లాడుతూ కేంద్ర నిధులతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పలు పథకాలను ప్రవేశపెట్టిందని, అట్టి పథకాలను ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రాబోయే అసెంబ్లి ఎన్నికలలో రాష్ట్రంలో బిజేపి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో మండల బిజేపి పార్టీ అధ్యక్షుడు వీరేశం, జిల్లా కార్యవర్గ సభ్యులు దొడ్డ సందీప్ కుమార్, గ్రామస్థులు చంద్రప్ప, శివ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యు.రమేష్

## వ్యవసాయాధారిత వ్యాపార నిర్వహణపై శిక్షణ

**యాలాల జులై 30,ప్రభాతవార్త :** వ్యవసాయ రంగంలో నూతన వ్యాపార అవకాశాలను ముందుకు తీసుకుపోవడంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థలు(ఎఫ్‌పిఒ)డైరెక్టర్ల పాత్ర కీలకమని తాండూరు వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్ పేర్కొన్నారు. బుధవారం యాలాల మండలంలోని లక్ష్మీనారాయణ పూర్‌లోని వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో అగ్రిహబ్ లౌలీహుడ్ బిజినెస్ ఇంక్యూబెటర్, ఆస్పైర్ మద్దతుతో డైరెక్టర్లకు రైతులను వ్యవసాయాధారిత వ్యాపారాల అభివృద్ధిని ఉద్దేశించి రైతులను వ్యాపారవేత్తలుగా అభివృద్ధి చేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగ శాస్త్రవేత్తలు ఎఫ్‌పిఒ డైరెక్టర్లకు వ్యాపారాభివృద్ధి, విలువ శృంఖల నిర్వాహణ, సమర్థవంతమైన వ్యవస్థాపనపై శిక్షణ ఇచ్చారు. అనంతరం డాక్టర్ సుధాకర్, ప్రధాన శాస్త్రవేత్త లవ్లీహుడ్ బిజినెస్ ఇంకుబెటర్ ప్రాజెక్టు ప్రిన్సిపల్‌లు గ్రామీణ వ్యవసాయాధారిత ఆధారంగా వ్యాపారాలను ప్రారంభించడానికి అవసరమైన మౌలిక సదుపాయాలు, శిక్షణ మద్దతు విధానాలపై వివరించారు. చిన్న సన్నకారు రైతుల సమస్యల పరిష్కరించేందుకు సమూహ నిర్మాణం, సమిష్టి మార్కెటింగ్,ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు ఎంతో అవసరమని వారు తెలిపారు. డిజిటల్ మార్కెటింగ్‌పై వారు అవగహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తాండూరు వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.



ఎఫ్‌పిఒ డైరెక్టర్లలకు శిక్షణ ఇస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

## ఉపాధి హామీ పథకం పనులు తనిఖీ

**కొడంగల్, జూలై 30 ప్రభాతవార్త :** కొడంగల్ మండలంలోని మూడుగ్రామాల్లో నేషనల్ లేవల్ మానిటరింగ్ బృంధం సభ్యలు జోసెఫ్, వినోద్‌లు పర్యటించారు. సోమవారం మండల పరిధిలోని హుస్సేన్‌పూర్‌లో పర్యటించగా మంగళవారం కస్తూర్‌పల్లి గ్రామంలో పర్యటించారు. అలాగే బుధవారం అన్నారం గ్రామంలో పర్యటించారు. అవెన్యూ ప్లాంటేషన్, గ్రామపంచాయతీ ఇందిరమ్మ ఇండ్లు పరిశీలించారు.గ్రామాల్లో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులు, గ్రామపంచాయతీల్లో రికార్డులు పెన్షన్‌లు,కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న స్వయం ఉపాధి కింద అమలు చేసిన పథకాలు, ఉపాధిహామీపథకంపై గ్రామాల్లో పర్యటించి వివరాలు సేకరించారు. అనంతరం గ్రామపంచాయతీల్లో రికార్డులు పరిశీలించారు. పొదుపు సంఘాలలో మహిళలు తీసుకున్న రుణాలు వాటిని ఏ విధంగా ఉపయోగించారని మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఉషశ్రీ, ఏపీడీ సరళ,ఎంపీఓ జైపాల్‌రెడ్డి,ఏఈ రవికిరణ్,ఏపీఎం వెంకన్న, ఏపీఓ రాములు పంచాయతీ కార్యదర్శి బాలరంగాచారీ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ గ్రామాన బిజెపి జెండా ఎగరేస్తాం

**కొందుర్గు, ప్రభాతవార్త, జూలై 30 :** కొందుర్గు మండల పరిధిలోని ముట్పూరు గ్రామంలో బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షుడు కృష్ణయ్య ఆధ్వర్యంలో బూత్ కమిటీ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలను సన్నద్ధం చేయడానికి, గ్రామాలలో వార్డు సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులను సిద్ధం చేయడానికి సమగ్ర కార్యాచరణతో మండల స్టీరింగ్ కమిటీ పనిచేస్తుందని, కార్యకర్తలందరు ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పోటీ చేసి గెలిచేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలలో ఎండగట్టి ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిట్టెం లక్ష్మీకాంత రెడ్డి, మండల స్థానిక సంస్థల ఎన్నికల ఇంచార్జి మంగన్నగారి బలవంత్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు లక్ష్మయ్య గౌడ్, శంకర్, అధికార ప్రతినిధి గుండేటి శివారెడ్డి, యువ మోర్చా మండల మాజీ అధ్యక్షుడు బోయ అశోక్, నాయకులు రామచందర్, శివకుమార్, విజయ భాస్కర్ రెడ్డి, రామస్వామి, ఆగమయ్య, రాజు, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎల్లమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం

**కీసర, జూలై 30, ప్రభాతవార్త:** ప్రజలకు ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ఉండాలని మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఈగ శ్వేత రాజు అన్నారు. బధవారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ 4వ వార్డులో ఎల్లమ్మ తల్లి గుడి ప్రథమ వార్షికోత్సవ పూజా కార్యక్రమాల్లో ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వంశిరాజ్ మల్లేష్,ఆర్‌జికె డెవలప్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మంగళపురి వెంకటేష్,ముదిరాజ్ సంఘం అధ్యక్షులు,ఆర్‌జికె డెవలప్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఈగ రాజు ముదిరాజు,ఉపాధ్యక్షులు రాజ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ గంగయ్య,ఆర్గనైజర్ సెక్రటరీ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ర్యాలీ

**కీసర, జూలై 30, ప్రభాతవార్త :** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కీసర పుడమి పాఠశాల ప్రిన్సిపాల్ రాయిల హరిణి కోరారు. కీసర పుడమి పాఠశాల యాజమాన్యం విద్యార్థులతో ప్లే కార్డులతో ప్రదర్శిస్తు కీసరలో మత్తు పదార్దాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దివ్య, సౌజన్య, పర్జాన ముంతాజ్, అంబిక, జయ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్ కోటులు అందజేత

**చేవెళ్ల, జూలై 30, ప్రభాతవార్త:** పురపాలక సంఘం శంకర్ పల్లి పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులకు బుధవారం చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య రెయిన్ కోట్, గ్లోవ్స్ అప్రాన్ లు అందజేశారు. అనంతరం కొత్త ట్రాక్టర్ కం డోజర్ కం స్వీపింగ్ మిషిన్ ప్రారంభోత్సవం చేశారు. మునిసిపల్ పార్క్ యందు వనమహోత్సవం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ ఏ.యోగేష్, మేనేజర్ అంజన్ కుమార్, మాజీ చైర్ పర్సన్, మాజీ కౌన్సిల్ సభ్యులు, మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**మేడ్చల్, జూలై 30. ప్రభాతవార్త :** గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ మండల పరిధిలోని కండ్లకోయ ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు పక్కన గల కాలీ ప్రదేశంలో పడి ఉన్న మృతదేహన్ని గమనించిన స్థానికులు పోలీసులు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించి మృతుడి ఆనవాళ్ల తెలియకపోవడంతో గుర్తు తెలియని మృతదేహంగా నిర్ధారించారు. మృతుడు వయస్సు సుమారు 45 నుండి 50 సంవత్సరాల మద్య కలిగి ఉంటాడని, వంటిపై పసుపుపచ్చ, నల్ల రంగు గల టీ షర్ట్, ఆష్ కలర్ పాంటు ఉన్నాయని పోలీసులు పేర్కొన్నారు. మృతదేహన్ని నగరంలోని గాంధీ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మన్మధరావు తెలిపారు.



మాట్లాడుతున్న అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి

## పార్టీ బలోపేతంకోసం కృషి

**మర్పల్లి, జూలై 30, ప్రభాతవార్త :** బిజెపి పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సైనికులుగా పనిచేయాలని బిజెపి జిల్లా పార్టీ అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షులు, రామేశ్వం రెడ్డిలు అన్నారు. మండలంలో పట్లూర్ గ్రామంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి సత్య చాటాలని ఎన్నికలకు కార్యకర్తలు సన్నద్ధం కావాలని వారు కోరారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజలకు వివరించాలని కోరారు. ఈకార్యక్రమంలో మండల ఎకాన్నికల ఇంచార్జీ యాదవరెడ్డి, బాలారంగౌడ్, శివరాజ్ పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాస్

## స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

**కొడంగల్, జూలై 30 ప్రభాతవార్త :** పోలీసులు అంకిత భావంతో విధులు నిర్వహించాలని పరిగి డీఎస్పీ శ్రీనివాస్ అన్నారు. బుధవారం కొడంగల్ పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ సందర్శించారు. పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను, పరిసరాలను పరిశీలించారు. అనంతరం సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సై జీవీ, సత్యనారాయణలతో పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో చేపట్టాల్సిన భద్రతా చర్యలపై సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.అంతకుముందు డీఎస్పీ కొడంగల్ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

## ట్రాక్టర్ కిందపడి యువకుడు మృతి

**తలకొండపల్లి జూలై 30, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని జూలపల్లి గ్రామంలో ట్రాక్టర్ కిందపడి ఆంజనేయులు(30) అనే యువకుడు మృతి చెందాడు. గ్రామస్తులు కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం జూలపల్లి గ్రామానికి చెందిన ఆంజనేయులు అనే యువకుడు కేశంపేట మండలం తొమ్మిది రేకుల గ్రామానికి చెందిన శ్రీశైలానికి చెందిన ట్రాక్టర్ ను అతడు తన పొలంలో దునడానికి తీసుకొచ్చాడు. ఇదే గ్రామానికి చెందిన ఆంజనేయులు ఆ ట్రాక్టర్ ను మొక్కల మిషన్ కోసం తీసుకెళ్లి మళ్లీ తీసుకొచ్చే గ్రామంలో అదుపుతప్పి అదే ట్రాక్టర్ క్రింద పడి మృతి చెందాడు. ఇదే గ్రామానికి చెందిన రాజు గణేష్ లో ట్రాక్టర్ పై ఉండి తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. మృతిచెందిన ఆంజనేయులకు భార్య ఒక కుమారుడు కూతురు ఉన్నారు. చిన్నతనంలో ట్రాక్టర్ పై మృతి చెందడంతో గ్రామం లో విషాదఛాయలు నెలకొన్నాయి.

## ఇందిరమ్మ పనులు వేగవంతం

**జిల్లేడు చౌదరిగూడెం, జులై, 30, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతీష్మాత్మకంగా ప్రవేశ పెట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను వేగవంతం చేయాలని ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుదవారం జిల్లెడు చౌదరిగూడ మండలంలోని పెద్ద ఎల్కిచర్ల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల స్లాబు పనులను ఆయన ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులు త్వరితగతిన పనులు పూర్తి చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులు చేపట్టాలని ఆయన పెర్కోన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు. మార్కెట్ కమిటి డైరెక్టర్ వెంకటనర్సింహారెడ్డి, శ్రీను, లింగంగౌడ్; నీలయ్య, రాంచద్రయ్య, పంచాయితీ కార్యదర్శి శ్రవన్ తదితరులు పాల్గొన్నారు.

## డబిల్‌పూర్‌లో పౌరహక్కుల దినోత్సవం

**మేడ్చల్, జూలై 30, ప్రభాతవార్త :** అంటరానితనం పేరుతో ఎవరిని దూషించినా చట్టరీత్యా నేరమవుతుందని మేడ్చల్ తహసీల్దార్ భూపాల్ అన్నారు. మేడ్చల్ ఉమ్మడి మండల పరిధి ఎల్లంపేట మున్సిపాలిటీలోని డబిల్‌పూర్ గ్రామంలో బుధవారం రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ రాజమల్లారెడ్డి, మున్సిపల్ అధికారి మధుసూధన్‌రెడ్డి, స్థానికులు సంజీవరావు, అశోక్ పాల్గొన్నారు.

## ప్రతి రైతుకు మూడు బస్తాల యూరియా

**తలకొండపల్లి, జూలై 30, ప్రభాతవార్త:** రైతులందరికీ అవసరమయ్యే యూరియా సిద్ధంగా ఉన్నట్లు మండల వ్యవసాయ అధికారి రేణుక చక్రవర్తిని అన్నారు. మండల కేంద్రంలోని సింగల్ విండో కార్యాలయంలో రైతులకు అందజేస్తున్న యూరియా గోదామును ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తలకొండపల్లి మండలానికి ఇప్పటికే 75 మెట్రిక్ టన్నుల యూరియా ప్రతిరోజు సరఫరా చేస్తున్నామన్నారు. మండలంలోని వెల్జల్, తలకొండపల్లి, పడకల్ పిఏసిఏస్ కేంద్రాలతో పాటు ఆగ్రోస్ కేంద్రాల ద్వారా యూరియా సరఫరా కొనసాగుతుందని వివరించారు. ప్రతి రైతుకు మూడు బస్తాల చొప్పున అందజేస్తున్నామని ఎలాంటి అపోహలకు గురికా వద్దని కోరారు. క్రమ పద్ధతిన కూపన్ల ఆధారంగా పంపిణీ చేస్తారన్నారు.



సింగల్ విండో కార్యాలయంలో యూరియా గోదామును పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి రేణుక చక్రవర్తి

## రూ.60వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

**తలకొండపల్లి, జూలై 30, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన పద్మ జంగయ్య అనే వ్యక్తికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆవంచ నరసింహ రాజు రెడ్డి ఆధ్వర్యంలో అందజేశారు. జంగయ్య గత కొన్ని రోజుల క్రితం అనారోగ్యం గురికావడంతో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ కింద 60 వేల రూపాయలు మంజూరు చేయించారు. ఈ సందర్భంగా నరసింహ రాజు రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే కాశిరెడ్డి సహకారంతో ఎంతోమంది పేద ప్రజలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రవీందర్ యాదవ్, అశ్వ యాదయ్య, నరసింహ మల్లేష్ పోతుగంటి గణేష్, యురేందర్ రెడ్డి కుమ్మరి యాదగిరి పురుషోత్తం సురేష్ శీను గణపతి తదితరులు పాల్గొన్నార



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న నాయకులు

## మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం

**తలకొండపల్లి, జూలై 30, ప్రభాతవార్త:** తల కొండ పల్లి మండల పరిధిలోని వివిధ గ్రామాలలో మృతి చెందిన మృతుల కుటుంబ సభ్యులను పలు వురు పరామర్శించారు. వెల్జాల్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఇస్రాయపల్లి గ్రామంలో బరిగల్ల వెంకటమ్మ సోమవారం మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ 3వేల రూపాయలు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు డోకూరు ప్రభాకర్ రెడ్డి రూ.3వేలు, ఆర్థిక సహాయం అందజేశారు. ఎడవెల్లి గ్రామానికి చెందిన పుట్ట అంజమ్మ ఇటీవల మృతి చెందింది. వారి కుటుంబ సభ్యులను మంగళవారం నాడు గౌరీ జువెలర్స్ అధినేత ఏం రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పాండురంగారెడ్డిలు పరామర్శించి రూ.5వేలు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దోకూరు ప్రభాకర్ రెడ్డి రూ.3వేలు, చుక్కాపూర్ మాజీ సర్పంచ్ దాసరి కృష్ణమ్మ రూ.వెయ్యి అందజేశారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న నాయకులు

## 300 మందికి అన్నప్రసాద వితరణ

**కడ్తాల్, జూలై 30, ప్రభాత వార్త :** అన్నం పరబ్రహ్మ స్వరూపమని, అన్నదానాన్ని మించిన దానం మరొకటి లేదని లయన్స్ క్లబ్స్ జిల్లా గవర్నర్ డాక్టర్ జి మహేంద్ర కుమార్ రెడ్డి పేర్కొన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ ఇమీడియట్ పాస్ట్ డైరెక్టర్ ఘట్టమనేని బాబురావు జన్మదినం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ కడ్తాల్ బస్టాండ్ వద్ద 300 మందికి అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో మహేంద్ర కుమార్ రెడ్డి ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. అన్నార్తుల ఆకలి బాధను తీర్చడం గొప్ప ధర్మ కార్యక్రమన్నారు. ఈ క్లబ్బు జిల్లాలోనే కాకుండా మల్టిపుల్ స్థాయిలో కూడా వివిధ క్లబ్బులకు ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. 300 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమ సమన్వయకర్త మాజీ జిల్లా గవర్నర్ లయన్ జి చెన్నె కిషన్ రెడ్డి, జిల్లా క్యాబినెట్ కార్యదర్శి తాళ్ల అంజయ్య, జోన్ చైర్మన్ జూలూరు లింగయ్య, క్లబ్ కార్యదర్శి గంప శ్రీనివాస్, కోశాధికారి శ్రీనివాస్ రెడ్డి, సభ్యులు గుమ్మడి నరసింహ, కే. రామ్ రెడ్డి, జుట్టు లక్ష్మయ్య, జహంగీర్, చేగురి వెంకటేష్, జల్కం రమేష్, గూడె రాజు, సి. జంగయ్య, తదితరులు పాల్గొన్నారు



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న లయన్స్ ప్రతినిధులు

## వసతి గృహాల్లో సమస్యలను పరిష్కరించాలి

**షాబాద్, జూలై 30, ప్రభాతవార్త:** సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలను పరిష్కరించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఏబీవీపీ శంషాబాద్ విభాగ హాస్టల్ కన్వీనర్ బర్ల శ్రీకాంత్ అన్నారు. షాబాద్ మండల కేంద్రంలోని బీసీ, ఎస్సీ వసతి గృహాలను బుధవారం సందర్శించి, విద్యార్థులకు వడ్డించే భోజనాన్ని పరిశీలించారు. హాస్టల్లో ఉన్న సమస్యలపై విద్యా ర్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ కార్యకర్తలు మధుకిరణ్, అజయ్, భారత్, తదితరులు ఉన్నారు.

## సీపీఐ జిల్లా మహాసభల కరపత్రం ఆవిష్కరణ

**షాబాద్, జూలై 30, ప్రభాతవార్త:** సీపీఐ 17వ జిల్లా మహాసభను విజయవంతం చేసేందుకు కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని పార్టీ షాబాద్ మండల కార్యదర్శి పాలమాకుల శ్రీశైలం కోరారు. బుధవారం ఆయన షాబాద్‌లో కార్యకర్తలతో కలిసి జిల్లా మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. ఆగస్టు 2న మొయినాబాద్ అంజనాదేవి గార్డెన్స్‌లో జిల్లా మహాసభ జరుగుతుందని, కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఇతర ముఖ్యనేతలు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో నేతలు నక్కలి జంగయ్య, రఘురాం, మధు, నారాయణ, రుక్కయ్య పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మండల కార్యదర్శి శ్రీశైలం

## హనుమాన్ దేవాలయానికి రూ.లక్ష విరాళం

**షాబాద్, జూలై 30, ప్రభాతవార్త:** మండలంలోని పెద్దవేడు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ దేవాలయానికి షాబాద్ మాజీ జడ్పిటిసి పట్నం అవినాష్ రెడ్డి తన వంతుగా రూ. లక్ష విరాళం ప్రకటించారు. బుధవారం హైదరాబాద్ ఆయన నివాసంలో పెద్దవేడు గ్రామస్తులు అవినాష్ రెడ్డిని కలవడంతో విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో చక్కటి దేవేందర్ రెడ్డి, బి. అశోక్ గౌడ్, బాలరాజ్ గౌడ్,సుదర్శన్ రెడ్డి, రఘుపతి రెడ్డి, రాజు, రవి, మల్లేశగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న దృశ్యం

## కష్టపడి చదివి ఉన్నత స్థానం చేరాలి

**ధారూర్, జూలై 30, ప్రభాతవార్త:** విద్యార్థులు కష్టంతో పాటు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ధారూర్ మాజీ జడ్‌పిటిసి, సీనియర్ నాయకులు వేణు గోపాల్‌రెడ్డి అన్నారు. బుదవారం ధారూర్ మండలం తరిగోపుల జిల్లా పరిషత్ పాఠశాలలోని 120 మంది విద్యార్థులకు టై, బ్యాచ్, బెల్ట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ముందుగా ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ఆ లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలని అన్నారు. ఇప్పుడు కష్టపడితేనే మునుముందు మంచి భవిషత్తు ఉంటుందని అన్నారు. విద్యార్థులను ఉన్నత స్థానాలకు తీసుకెళ్ళే బాధ్యత ప్రతి ఉపాధ్యాయునిపై ఉందని గుర్తుచేశారు. అనంతరం హెచ్ఎం ప్రభాకర్, ఉపాధ్యాయ బృందంతో కలిసి వేణు గోపాల్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకట్‌రాంరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ చిట్టి శ్రీనివాస్, బీసీ సెల్ మండల అధ్యక్షులు యాదయ్య, మాజీ వార్డు సభ్యులు శేఖర్‌రెడ్డి, శ్యామలయ్య, దస్తయ్య గౌడ్, ఎస్ఎంసి మాజీ చైర్మెన్ వెంకట్‌రావు, బందెయ్య,కోపూరి రాంచంద్రయ్య, తలారి యాదయ్య, శివాజీరావు, మానెయ్య, బెన్నూర్ రాములు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.